


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు





సంపుటి : 1 సంచిక : 118 పేజీలు : 8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : తాడేపల్లిగూడెం మంగళవారం 10 మార్చి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 118 PAGES : 8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : THADEPALLI GUDEM TUE 10 MARCH 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur


# గత ప్రభుత్వ తప్పిదాలను
# సరిదిద్దుతున్నాం

- నంద్యాల జిల్లా కొత్త బురుజులో రైతులకు పట్టాదార్ పాస్‌పుస్తకాల పంపిణీ
- ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ పేరుతో గత ప్రభుత్వం భూములు లాక్కునే ప్రయత్నం చేసిందన్న సీఎం
- రికార్డులు ట్యాంపరింగ్ కాకుండా క్యూఆర్ కోడ్, బ్లాక్ చైన్ టెక్నాలజీతో కొత్త పాస్‌పుస్తకాలు
- కేంద్ర సాయంతో రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా మారుస్తామని వెల్లడి
- గత ప్రభుత్వంలా విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజలపై భారం మోపబోమని స్పష్టీకరణ



**పెన్ పవర్ డెస్క్:** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం నంద్యాల జిల్లా కొత్త బురుజు గ్రామంలో రైతులకు కొత్త పట్టాదార్ పాస్‌పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ.. గత వైసీపీ ప్రభుత్వం చేసిన తప్పులను కూటమి ప్రభుత్వం సరిదిద్దుతోందని స్పష్టం చేశారు. గత పాలకులు రెవెన్యూ వ్యవస్థను భ్రష్టు పట్టించారని, ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ పేరుతో రైతులు, పేదల భూములను లాక్కునే ప్రయత్నం చేశారని ఆరోపించారు.రాజకీయ కక్ష సాధింపులు, అక్రమ ఆక్రమణల కోసమే గత ప్రభుత్వం 1.95 కోట్ల ఎకరాలను సెక్షన్ 22ఏ కింద నిషేధిత జాబితాలో పెట్టిందని సీఎం మండిపడ్డారు. తాము అధికారంలోకి రాగానే ఆ చట్టాన్ని రద్దు చేసి, రికార్డుల్లోని తప్పులను సరిచేస్తున్నామని చెప్పారు. గత పాలకులు పాస్ పుస్తకాలపై, సర్వే రాళ్లపై తమ ఫోటోలు వేసుకుని రూ.750 కోట్లు వృథా చేశారన్నారు. రైతుల సమక్షంలోనే కొలతలు వేసి, వారి ఆమోదంతోనే ఎలాంటి అవినీతికి తావులేకుండా పారదర్శకంగా కొత్త పుస్తకాలు ఇస్తున్నట్లు వివరించారు. క్యూఆర్ కోడ్, బ్లాక్ చైన్ టెక్నాలజీని వినియోగిస్తున్నామని, దీనివల్ల రికార్డులను ఎవరూ ట్యాంపరింగ్ చేయలేరని, అధికారులు తప్పు చేసినా ఇట్టే తెలిసిపోతుందని పేర్కొన్నారు.రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా మారుస్తామని సీఎం పునరుద్ఘాటించారు. ఇందుకోసం పూర్వోదయ పథకం కింద కేంద్రం రూ.30 వేల కోట్లు ఇస్తుందని తెలిపారు. కర్నూలులో డ్రోన్ సిటీ, అనంతపురంలో ఏరోస్పేస్ సిటీ ఏర్పాటు చేస్తామన్నారు. గత ప్రభుత్వం ఎనిమిది సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజలపై రూ.32 వేల కోట్ల భారం మోపిందని, కూటమి ప్రభుత్వం ఛార్జీలు పెంచబోదని హామీ ఇచ్చారు. అలాగే, తిరుపతి లడ్డూ వ్యవహారంపై ప్రతిపక్షం తప్పుడు ప్రచారం చేస్తోందని, శ్రీవారి పవిత్రతను దెబ్బతీసే ఎలాంటి చర్యలనూ సహించేది లేదని చంద్రబాబు హెచ్చరించారు. రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు వస్తున్నాయని ఆయన హర్షం వ్యక్తం చేశారు.



## రేవేంద్రపాడులో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రి లోకేశ్

- మంత్రి నారా లోకేశ్ ఘనస్వాగతం పలికిన స్థానికులు, టీడీపీ శ్రేణులు
- భారీ ర్యాలీ మధ్య విగ్రహాన్ని ఆవిష్కరించిన విద్యా, ఐటీ శాఖల మంత్రి
- ఎన్టీఆర్, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులు
- కార్యక్రమంలో పాల్గొన్న పలువురు ముఖ్య నాయకులు, కార్యకర్తలు

**పెన్ పవర్ డెస్క్:** మంగళగిరి నియోజకవర్గం దుగ్గిరాల మండలం రేవేంద్రపాడులో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహాన్ని రాష్ట్ర విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ నేడు లాంఛనంగా ఆవిష్కరించారు. ఇవాళ రేవేంద్రపాడు చేరుకున్న మంత్రి లోకేశ్ కు స్థానిక ప్రజలు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. అనంతరం గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ మధ్య ఉత్సాహభరిత వాతావరణంలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ జరిగింది. విగ్రహావిష్కరణ తరువాత అక్కడ ఉన్న ఎన్టీఆర్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాలకు లోకేశ్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమానికి వచ్చిన అభిమానులు, కార్యకర్తలతో

మిగతా 2లో



## అవి ప్రభుత్వ హత్యలే

- రాజమండ్రి కల్తీ పాల ఘటనలో 11 మంది మృతి
- ప్రభుత్వ నేరపూరిత నిర్లక్ష్యమే కారణమని షర్మిల తీవ్ర ఆరోపణ
- 11 ఏళ్లుగా లైసెన్స్ లేకుండానే వ్యాపారం జరిగిందని విమర్శ
- మృతుల కుటుంబాలకు రూ. 25 లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్
- బాధితులను పరామర్శించని జగన్‌పై కూడా విమర్శలు

మిగతా 2లో



## జమిలి ఎన్నికల వల్ల రాష్ట్ర ఎన్నికల ప్రాధాన్యత తగ్గుతుంది

- కేంద్ర ప్రభుత్వం చేతుల్లోకి అధికారాలన్నీ వెళతాయన్న స్టాలిన్
- అసలు సమస్య కంటే దారుణమైన పరిణామాలకు దారితీస్తుందని ఆందోళన
- జమిలి ఎన్నికలతో జాతీయస్థాయి పార్టీలకే ప్రయోజనమని ఆందోళన

మిగతా 2లో

## అమరావతిలో టీటీడీ ఆలయం కోసం రూ. 12.5 కోట్లు పెట్టి భూమి కొనడం ఏమిటి?

- అమరావతి వెంకటాయపాలెంలో శ్రీవారి ఆలయ నిర్మాణం
- సాధారణంగా ఆలయాల నిర్మాణానికి భక్తులు లేదా సంస్థలు ఉచితంగా భూములు ఇస్తారన్న భూమన
- భక్తుల సొమ్మును టీటీడీ దుర్వినియోగం చేసిందని విమర్శ

మిగతా 2లో





## వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల రాష్ట్రంలో చెత్త సమస్య తీవ్ర రూపం దాల్చింది

**పెన్ పవర్ డెస్క్:** గత వైసీపీ ప్రభుత్వంపై ఏపీ మంత్రి నారాయణ విమర్శనాస్త్రాలు సంధించారు. జగన్ ఐదేళ్ల పాలనను 'చెత్త పాలన'గా అభివర్ణిస్తూ, ఆ సమయంలో పేరుకుపోయిన వ్యర్థాల సమస్య రాష్ట్రానికి పెను సవాలుగా మారిందని ఆయన మండిపడ్డారు. వైసీపీ హయాంలో పట్టణాల్లో పారిశుద్ధ్యం పడకేయడం వల్లే నేడు భారీస్థాయిలో చెత్త నిల్వలు పేరుకుపోయాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.ద రాష్ట్రవ్యాప్తంగా సుమారు

మిగతా 2లో



## ఏపీ మద్యం కుంభకోణం కేసు.. ఈడీ దర్యాప్తు ముమ్మరం

- ఈడీ విచారణకు హాజరైన ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి, వెంకటేశ్ నాయుడు, చాణక్య
- రెండు గంటల విచారణ తర్వాత వెళ్లిపోయిన ధనుంజయరెడ్డి
- నగదు రూపంలో లావాదేవీలపై ఈడీ అధికారుల ప్రశ్నలు

**పెన్ పవర్ డెస్క్:** ఆంధ్రప్రదేశ్ మద్యం కుంభకోణం కేసులో విచారణను ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ముమ్మరం చేసింది. ఈ కేసులో ప్రధాన నిందితులుగా ఉన్న కె.ధనుంజయరెడ్డి , కృష్ణమోహన్‌రెడ్డి, వెంకటేశ్ నాయుడు, చాణక్య

మిగతా 2లో

## ఇరాన్‌కు రష్యా పూర్తి అండగా ఉంటుంది

- పశ్చిమాసియాలో గరిష్ట స్థాయికి చేరిన ఉద్రిక్తతలు
- ఇరాన్‌కు వ్యూహాత్మక మద్దతును ప్రకటించిన పుతిన్
- ఇరాన్ నేతల మృతి పట్ల తీవ్ర సంతాపం



**పెన్ పవర్ డెస్క్:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తీవ్ర స్థాయికి చేరిన వేళ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఇరాన్‌కు తన మద్దతును ప్రకటించారు. ఇజ్రాయెల్, అమెరికాలతో సాగుతున్న ఘర్షణల్లో మిత్రదేశమైన ఇరాన్‌కు మాస్కో అండగా ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు. ఇరాన్ నూతన సుప్రీం లీడర్‌గా బాధ్యతలు చేపట్టిన ముజ్తబా ఖమేనీకి పుతిన్ అభినందనలు తెలుపుతూ, ప్రస్తుత సంక్షోభ పరిస్థితుల్లో దేశాన్ని సమర్థవంతంగా నడిపించగలరని ఆశాభావం వ్యక్తం చేశారు. సరిహద్దుల్లో ఎదురవుతున్న సాయుధ

మిగతా 2లో

## రాజ్యసభ సభ్యులుగా వేం నరేందర్ రెడ్డి, అభిషేక్ సింఘ్వీ ఏకగ్రీవం



- రాజ్యసభ సభ్యులుగా తెలంగాణ నుంచి ఎన్నికైన వేం నరేందర్ రెడ్డి, అభిషేక్ సింఘ్వీ
- ఇద్దరికీ ధృవపత్రాలు అందించిన రిటర్నింగ్ అధికారి
- సమస్యలను పరిష్కరించి కేంద్రంపై ఒత్తిడి తీసుకువస్తామన్న వేం నరేందర్ రెడ్డి

**పెన్ పవర్ డెస్క్:** తెలంగాణ సమస్యలను రాజ్యసభలో, ఢిల్లీలో వినిపిస్తానని రాజ్యసభకు ఏకగ్రీవంగా ఎన్నికైన వేం నరేందర్ రెడ్డి అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ తరఫున రాజ్యసభ సభ్యులుగా అభిషేక్ మను సింఘ్వీ, వేం నరేందర్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇద్దరికీ రిటర్నింగ్ అధికారి ధృవపత్రాలను

మిగతా 2లో

## ఈశాన్య రాష్ట్రాల ప్రజలకు ఢిల్లీ సేఫ్ కాదు బీజేపీ ఎంపీ సంచలన వ్యాఖ్యలు

- జాతి వివక్ష, దాడుల ఘటనల పట్ల ఆందోళన వ్యక్తం చేసిన ఎంపీ
- బలమైన, చట్టపరమైన చట్రాలు అవసరమన్న బీజేపీ ఎంపీ
- అట్రాసిటీ లాంటి చట్టాన్ని తీసుకురావాలని విజ్ఞప్తి



**పెన్ పవర్ డెస్క్:** అరుణాచల్ ప్రదేశ్‌కు చెందిన బీజేపీ ఎంపీ తపిర్ గావో సంచలన వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీలోని ఈశాన్య రాష్ట్రాల ప్రజల భద్రతపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. తమ ప్రజలకు ఢిల్లీ సురక్షితం కాదని ఆయన అన్నారు. దేశ రాజధానిలో జాతి వివక్ష, దాడుల సంఘటనలు ఆందోళనకరమని పేర్కొన్నారు.

మిగతా 2లో

## లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన సైబర్ క్రైమ్ ఎస్సైలు

- రెడ్ హ్యాండెడ్‌గా దొరికిన ఎల్బీనగర్ సైబర్‌క్రైమ్ ఎస్సైలు
- ఒక కేసు విషయంలో లక్ష రూపాయల లంచం డిమాండ్ చేసిన వైనం
- ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేసిన బాధితుడు




మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

## ప్రమాదపుటంచున ప్రజారోగ్యం

ఆహార భద్రత ఏ ప్రభుత్వానికైనా అత్యంత ప్రాథమిక బాధ్యతల్లో ఒకటి. ప్రజలు తాగే పాలు, తినే తిండి భద్రంగా ఉన్నాయా అనే విషయంలో నమ్మకం లేకపోతే, పాలనపట్ల తీవ్రమైన ప్రశ్నలు తలెత్తుతాయి. భారతదేశంలో తరచుగా వెలుగులోకి వస్తున్న పాలకల్తీ ఘటనలు, అలాగే నిద్రపోతున్న నియంత్రణ వ్యవస్థ, అమలు కాని ఆహార భద్రత చట్టాలు, ఆహార భద్రతను నిర్ధారించాల్సిన వ్యవస్థ ఇంకా సరైన స్థాయిలో పనిచేయడం లేదని స్పష్టంగా చూపిస్తున్నాయి. ఒకే వ్యాపారి సరఫరా చేసిన కల్తీ పాలు తాగినందున వందకుపైగా కుటుంబాలు ప్రభావితమయ్యాయి. తొమ్మిది మంది తీవ్రమైన మూత్రపిండ వైఫల్యంతో ప్రాణాలు కోల్పోయారు. చిన్నపిల్లలు సహా పలువురు ఇంకా పదుల సంఖ్యలో వెంటిలేటర్‌పై ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఈ దుర్ఘటన తర్వాత కూడా కల్తీ పదార్థాన్ని గుర్తించడానికి రాష్ట్రం వెలుపల ఉన్న ప్రయోగశాలల నివేదికలు రావాల్సి వచ్చింది. స్థానిక స్థాయిలో తక్షణంగా పరీక్షించే సామర్థ్యం లేకపోవడంవల్ల, ప్రమాదాన్ని ముందుగానే అరికట్టాల్సిన వ్యవస్థ ప్రాణనష్టాల తర్వాత మాత్రమే స్పందించింది. ఇలాంటి సమయంలో ఆహార భద్రత మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడం ప్రభుత్వ ప్రాధాన్యంగా ఉండాలి. అయితే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రస్తుతం డ్రాఫ్ట్ పాపులేషన్ మేనేజ్‌మెంట్ పాలసీపై దృష్టి సారించింది. పోషణ–శిక్ష సురక్ష ప్యాకేజ్‌ద్వారా రాష్ట్రంలో మొత్తం ఫెర్టిలిటీ రేటును 1.5 నుంచి 2.1కు పెంచాలని లక్ష్యంగా పెట్టుకుంది. మూడో బిడ్డకు ప్రోత్సాహకరంగా ప్రసవ సమయంలో రూ. 25,000, ఐదేళ్లపాటు ప్రతి నెల రూ. 1,000 ఆర్థిక సహాయం, 18 ఏళ్ల వరకు ఉచిత విద్య ఇవ్వాలని ప్రతిపాదించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అసెంబ్లీలో ఈ విధానాన్ని ప్రవేశపెడుతూ, జననాల రేటు తగ్గిపోతే జపాన్, ఇటలీ, దక్షిణకొరియా వంటి దేశాల్లో ఎదురైన జనాభా సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. దీర్ఘకాలిక జనాభా ప్రణాళిక అవసరమే అయినప్పటికీ, పాలకల్తీ వంటి తక్షణ ప్రజాఆరోగ్య సమస్యలకు మరింత ప్రాధాన్యం ఇవ్వాలని విమర్శకులు అంటున్నారు.

దేశవ్యాప్తంగా కూడా పాలనాణ్యతపై ఆందోళన కలిగించే విషయాలు బయటపడుతున్నాయి. భారత ఆహార భద్రత, ప్రమాణాల సంస్థ నిర్వహించిన సర్వేలు, పెద్ద సంఖ్యలో పాల నమూనాలు నాణ్యత ప్రమాణాలను తీరకపోవడం చూపిస్తున్నాయి. పాలలో నీరు కలపడం అత్యంత సాధారణమైన కల్తీ విధానం. దీనివల్ల పాలపోషక విలువ తగ్గిపోవడమే కాకుండా, కలుషిత నీరు వాడితే పురుగుమందులు, భారీ లోహాలు వంటి హానికర పదార్థాలు కూడా చేరే ప్రమాదం ఉంది. కొన్ని నమూనాల్లో డిటర్జెంట్లు, యూరియా, స్టార్చ్, గ్లూకోజ్, ఫార్మలిన్ వంటి పదార్థాలు కూడా కనిపించాయి. ఇవి పాల మందాన్ని పెంచడానికి లేదా నిల్వకాలాన్ని పెంచడానికి ఉపయోగిస్తారు. అయితే ఇవి ఆరోగ్యానికి తీవ్రమైన ప్రమాదాన్ని కలిగిస్తాయి. వైద్య పరిశోధనలు చూపుతున్నట్లుగా, ఇటువంటి కల్తీ పదార్థాలు జీర్ణాశయ సమస్యలు, ఆహార విషబాధ, అవయవాల నష్టం, దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలకు కారణమవుతాయి. మునుపటి సర్వేలు పరీక్షించిన నమూనాల్లో దాదాపు 70 శాతం నాణ్యత ప్రమాణాలను తీరలేదని సూచించాయి. అయితే అన్ని నమూనాలు ప్రమాదకరంగా ఉండేవి కావు.

ఎఫ్ఎస్ఎస్ఎఐ నిర్వహించిన సమగ్ర జాతీయ సర్వేలో దేశవ్యాప్తంగా 6,432 నమూనాలను పరీక్షించారు. వాటిలో కొద్దిపాటి నమూనాల్లో మాత్రమే హైడ్రోజన్ పెరాక్సైడ్, డిటర్జెంట్లు, యూరియా వంటి ప్రమాదకర కల్తీలు కనిపించాయి. కానీ దాదాపు 41 శాతం నమూనాలు కొవ్వు, సాలిడ్ నాట్ ఫ్యాట్ వంటి ముఖ్య నాణ్యత ప్రమాణాలను తీరలేదని వెల్లడైంది. ఈ సర్వేలో 5.7 శాతం నమూనాల్లో అఫ్లాటాక్సిన్ ఎం1 అవశేషాలు కనిపించాయి. ఇది పశువులకు ఇచ్చే ఆహారంలో కలుషితం కారణంగా పాలలో చేరుతాయి. ఇది డెయిరీ వ్యవసాయం, సరఫరా నిర్వహణలో ఉన్న సమస్యలను సూచిస్తుంది. ఈ వివరాలు పాల భద్రత, పాల నాణ్యత మధ్య ఉన్న ముఖ్యమైన తేడాను చూపిస్తున్నాయి. భద్రత నాణ్యతను నిర్ధారించడం కేవలం నియంత్రణ సమస్య కాదు, అది కీలకమైన ప్రజాఆరోగ్య బాధ్యత. ప్రభుత్వాలు ఆహార పరీక్షా ప్రయోగశాలలను బలోపేతం చేయాలి, తగిన సంఖ్యలో నిపుణులను నియమించాలి, డెయిరీ సరఫరా వ్యవస్థపై కఠిన పర్యవేక్షణ అమలు చేయాలి. ఈ చర్యలు తీసుకోకపోతే, ప్రతి రోజు కోట్లాది వినియోగదారుల మనసులో ఒక ప్రశ్న మిగిలిపోతూనే ఉంటుంది. మనము తాగే పాలు నిజంగా భద్రమేనా?

# ఈశాన్య రాష్ట్రాల ప్రజలకు ఢిల్లీ సేఫ్ కాదు
# బీజేపీ ఎంపీ సంచలన వ్యాఖ్యలు

- మొదటి పేజి తరువాయి

ఈ అంశాన్ని పార్లమెంటులో లేవనెత్తుతానని అన్నారు. ఈశాన్య ప్రాంతానికి చెందిన ప్రజల రక్షణకు బలమైన చట్టపరమైన చట్రాలు అవసరమని తెలిపారు. కేంద్ర ప్రభుత్వంతోపాటు బీజేపీ ప్రభుత్వం ఉన్న దేశ రాజధానిలో ఈశాన్య ప్రజలపై జరుగుతున్న దాడుల పట్ల ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈశాన్య రాష్ట్రాల ప్రజలపై జాతి వివక్షత చూపడంతోపాటు దాడులు జరుగుతున్నాయని అన్నారు. ఢిల్లీలోనే కాదు, దేశవ్యాప్తంగా ఉన్న అన్ని మెట్రోపాలిటన్ నగరాల్లో కూడా ఈశాన్య ప్రాంతాల ప్రజలు జాతి వివక్ష, దాడులు, హత్యలను ఎదుర్కొంటున్నారని వాపోయారు. కేంద్ర హోంమంత్రిని కలిసి అట్రాసిటీ లాంటి చట్టాన్ని తీసుకురావాలని కోరతామని తపిర్ గావో అన్నారు.

# అవి ప్రభుత్వ హత్యలే

రాజమండ్రిలో కల్తీ పాలు తాగి 11 మంది మరణించడంపై ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రంగా స్పందించారు. ఈ మరణాలను ప్రభుత్వ హత్యలుగా అభివర్ణించిన ఆమె, రాష్ట్ర ప్రభుత్వ నేరపూరిత నిర్లక్ష్యం, ఆహార భద్రతా వైఫల్యమే ఈ ఘోరానికి కారణమని ఆరోపించారు.

నేడు రాజమండ్రిలోని కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించిన అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. ఇది ప్రమాదం కాదని, అధికారుల ఉదాసీనత వల్లే జరిగిందని అన్నారు. వరలక్ష్మి అనే పాల వ్యాపారి దాదాపు 11 ఏళ్లుగా ఎలాంటి లైసెన్స్ లేకుండా వ్యాపారం చేస్తున్నా, ఫుడ్ సేఫ్టీ అధికారులు చర్యలు తీసుకోకపోవడం దారుణమని విమర్శించారు. అధికారులకు తెలియకుండా ఇన్నేళ్లుగా అక్రమ వ్యాపారం ఎలా సాధ్యమైందని ఆమె ప్రశ్నించారు. ఇథిలీన్ గ్లైకాల్ కలిపిన పాలు తాగడం వల్లే పలువురు తీవ్ర అస్వస్థతకు గురయ్యారని, కొందరు వెంటిలేటర్‌పై ప్రాణాలతో పోరాడుతున్నారని షర్మిల ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పాలు, నెయ్యి, మద్యం, తాగునీరు సహా అన్ని నిత్యావసరాలు కల్తీమయం అవుతున్నా, సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రాజమండ్రి వంటి నగరానికి ఒక్కరే ఫుడ్ సేఫ్టీ అధికారి ఉండటం, ఆయన కూడా స్థానికంగా అందుబాటులో లేకపోవడం సిబ్బంది కొరతకు నిదర్శనమన్నారు. ఈ ఘటనకు ముఖ్యమంత్రి చంద్రబాబు నైతిక, పరిపాలనా బాధ్యత వహించాలని షర్మిల డిమాండ్ చేశారు. ఫుడ్ సేఫ్టీ విభాగంలో వెంటనే భారీగా నియామకాలు చేపట్టి, కఠిన తనిఖీలు నిర్వహించాలన్నారు. మృతుల కుటుంబాలకు ప్రకటించిన రూ. 10 లక్షల పరిహారాన్ని రూ. 25 లక్షలకు పెంచాలని కోరారు. బాధితులను మాజీ ముఖ్యమంత్రి జగన్ ఇప్పటివరకు పరామర్శించకపోవడం సరికాదని అన్నారు. సామాన్య ప్రజల పట్ల ఆయన వైఖరి ఏంటో దీని ద్వారా తెలుస్తోందని విమర్శించారు. ప్రభుత్వం ఇప్పటికైనా మేల్కొని ఆహార భద్రతా నిబంధనలను కఠినంగా అమలు చేయకపోతే ఇలాంటి దుర్ఘటనలు పునరావృతం అవుతాయని హెచ్చరించారు.

## జమిలి ఎన్నికల వల్ల రాష్ట్ర ఎన్నికల ప్రాధాన్యత తగ్గుతుంది

వన్ నేషన్ వన్ ఎలక్షన్ (జమిలి ఎన్నికలు) వల్ల రాష్ట్ర ఎన్నికల ప్రాధాన్యత తగ్గిపోతుందని, కేంద్ర ప్రభుత్వం చేతుల్లోకి అధికారాలన్నీ వెళతాయని తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ మండిపడ్డారు. జమిలి ఎన్నికల విధానంపై ఆయన స్పందిస్తూ, ఈ విధానం దేశానికి ఒక పరిష్కారం చూపిస్తుందేమో కానీ, అసలు సమస్య కంటే దారుణమైన పరిణామాలకు దారితీస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. లోక్ సభకు, రాష్ట్రాలకు ఒకేసారి ఎన్నికలు జరపడమంటే భారతదేశ సమాఖ్య నిర్మాణం, ప్రజాస్వామ్య వైవిధ్యం దెబ్బతింటుందని అన్నారు. రాష్ట్రాలకు రాజ్యాంగం కల్పించిన హక్కులు కాలరాసినట్లవుతుందని విమర్శించారు. జమిలి ఎన్నికలు జరిగితే జాతీయ స్థాయి పార్టీలకే ప్రయోజనం చేకూరుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రాంతీయ సమస్యలు, ప్రజల మనోభావాలు పక్కకు వెళతాయని అన్నారు. కేవలం ఖర్చు తగ్గుతుందనే కారణంతో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయకూడదని అన్నారు.

# వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల రాష్ట్రంలో చెత్త సమస్య తీవ్ర రూపం దాల్చింది

- మొదటి పేజి తరువాయి

కోటి 53 లక్షల టన్నుల చెత్త నిల్వలు పేరుకుపోయాయని గుర్తించినట్లు మంత్రి వెల్లడించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు యుద్ధ ప్రాతిపదికన పారిశుద్ధ్య పనులు చేపట్టి, ఇప్పటివరకు కోటి 15 లక్షల టన్నుల చెత్తను క్లియర్ చేశామని వివరించారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనే పది 'వేస్ట్ టు ఎనర్జీ' (చెత్త నుంచి విద్యుత్) ప్లాంట్లు ప్రారంభించామని, వాటిలో రెండు పూర్తి చేశామని గుర్తుచేశారు. జగన్ ప్రభుత్వం ఆ ప్లాంట్లను పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేయడం వల్లే నేడు రాష్ట్రంలో చెత్త సమస్య ఇంత తీవ్రరూపం దాల్చిందని ఆయన ధ్వజమెత్తారు.

భవిష్యత్తులో ఈ సమస్య తలెత్తకుండా ప్రధాన నగరాల్లో పీపీపీ పద్ధతిలో అత్యాధునిక వేస్ట్ ఎనర్జీ పవర్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నామని నారాయణ పేర్కొన్నారు. వ్యర్థాల నిర్వహణలో శాస్త్రీయ పద్ధతులను

అనుసరిస్తూ రాష్ట్రాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. నెల్లూరు జిల్లా అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించిన ఆయన, పెండింగ్‌లో ఉన్న డ్రైనేజీ, తాగునీటి ప్రాజెక్టులను త్వరలోనే పూర్తి చేస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు.

# లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన సైబర్ క్రైమ్ ఎస్సైలు

ఎల్బీనగర్ సైబర్‌క్రైమ్ పోలీస్ స్టేషన్ కు చెందిన ఇద్దరు ఎస్సైలు ఏసీబీకి అడ్డంగా దొరికిపోయారు. ఒక కేసులో నిందితుడికి 41 నోటీసులు ఇచ్చేందుకు లంచం డిమాండ్ చేసి ఏసీబీ అధికారులకు చిక్కారు. వివరాల్లోకి వెళితే... ఎల్బీనగర్ సైబర్‌క్రైమ్ విభాగంలో పనిచేస్తున్న ఎస్ఐ బాబునాయక్, ఎస్ఐ ప్రమోద్ ఒక కేసు విషయంలో నిందితుడిని ఇబ్బంది పెట్టకుండా ఉండేందుకు, నోటీసులు ఇచ్చే ప్రక్రియను పూర్తి చేసేందుకు లక్ష రూపాయలను లంచంగా డిమాండ్ చేశారు. దీనిపై బాధితుడు అవినీతి నిరోధక శాఖ అధికారులను ఆశ్రయించడంతో వారు పక్కా ప్లాన్ వేశారు. ఫిర్యాదుదారు నుంచి ఆ లక్ష రూపాయల నగదును ఎస్ఐలు తీసుకుంటుండగా, మాటు వేసిన ఏసీబీ అధికారులు వారిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం ఎల్బీనగర్ సైబర్‌క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో ఏసీబీ బృందాలు విస్తృతంగా సోదాలు నిర్వహించాయి.

# అమరావతిలో టీటీడీ ఆలయం కోసం రూ. 12.5 కోట్లు పెట్టి భూమి కొనడం ఏమిటి?

ముఖ్యమంత్రి చంద్రబాబు, టీటీడీ ప్రస్తుత పాలకమండలిపై టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. అమరావతిలోని వెంకటాయపాలెంలో శ్రీవారి ఆలయ నిర్మాణానికి సంబంధించి టీటీడీ తీసుకున్న నిర్ణయాలను ఆయన తప్పుబట్టారు.

శ్రీవారిని కూడా రాజకీయ అవసరాలకు వాడుకునేలా చంద్రబాబు కుట్రలు చేస్తున్నారని భూమన ఆరోపించారు. సాధారణంగా దేవుడి ఆలయాల నిర్మాణానికి భక్తులు లేదా సంస్థలు ఉచితంగా భూములు ఇస్తాయని, కానీ అమరావతిలో టీటీడీ ఆలయం కోసం రూ. 12.5 కోట్లు వెచ్చించి భూమిని కొనడం ఏంటని ఆయన ప్రశ్నించారు. టీటీడీ చరిత్రలో ఎప్పుడూ ఆలయాల కోసం భూమిని కొనుగోలు చేసిన దాఖలాలు లేవని, ఇది భక్తుల సొమ్మును దుర్వినియోగం చేయడమేనని మండిపడ్డారు. వివిధ ప్రైవేట్ సంస్థలకు ఉచితంగా భూములు కేటాయిస్తున్న ప్రభుత్వం, దేవుడికి మాత్రం భూమిని అమ్ముతోందని విమర్శించారు. టీటీడీ చెల్లించిన రూ. 12.5 కోట్ల సొమ్మును సీఆర్డీఏ వెంటనే వెనక్కి ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

మరోవైపు టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడిపై వస్తున్న వ్యక్తిగత ఆరోపణలపైనా భూమన స్పందించారు. మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి పవిత్రమైన టీటీడీ చైర్మన్ పదవిలో ఉండటం సరికాదని, ఆయన వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఇటీవల తిరుమలలో నెయ్యి ట్యాంకర్ బోల్తా పడటం వంటి ఘటనలు స్వామివారు ఆగ్రహించడమేనని ఆయన వ్యాఖ్యానించారు. తిరుమల పవిత్రతను కాపాడటంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని భూమన కరుణాకర్ రెడ్డి ధ్వజమెత్తారు.

## రేవేంద్రపాడులో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రి లోకేశ్

- మొదటి పేజి తరువాయి

ఆయన కాసేపు ముచ్చటించి, వారితో కలిసి ఫోటోలు దిగారు. ఈ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో గుంటూరు పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, దుగ్గిరాల మార్కెట్ యార్డ్ డైరెక్టర్ కాసరనేని జశ్వంత్, దుగ్గిరాల మండల టీడీపీ అధ్యక్షురాలు కేశినేని శ్రీఅనిత తదితరులు పాల్గొన్నారు. పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు, స్థానికులు తరలిరావడంతో రేవేంద్రపాడులో కోలాహలం నెలకొంది.

## ఇరాన్‌కు రష్యా పూర్తి అండగా ఉంటుంది

- మొదటి పేజి తరువాయి

దురాక్రమణను తిప్పికొట్టడంలో ఇరాన్‌కు ముజ్తబా నాయకత్వం అవసరమని పుతిన్ పేర్కొన్నారు. ఇటీవల ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ ఖమేనీ సహా ఇతర అగ్రనేతల మృతిపై ఆయన తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ ఆంక్షలు, యుద్ధ మేఘాల మధ్య రష్యా–ఇరాన్‌ల మధ్య బలపడుతున్న ఈ వ్యూహాత్మక బంధం పశ్చిమాసియా రాజకీయ సమీకరణాలను వేగంగా మారుస్తోంది. రష్యా ఇస్తున్న ఈ బహిరంగ హామీ ఇరాన్‌కు అంతర్జాతీయ స్థాయిలో భారీ నైతిక బలాన్ని చేకూర్చనుంది.

## ఏపీ మద్యం కుంభకోణం కేసు.. ఈడీ దర్యాప్తు ముమ్మరం

- మొదటి పేజి తరువాయి

ఈడీ విచారణకు హాజరయ్యారు. రెండు గంటల విచారణ తర్వాత కృష్ణమోహన్‌రెడ్డి వెళ్లిపోగా... ఇతర నిందితులను అధికారులు ప్రశ్నిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో మద్యం పాలసీని ఎలా రూపొందించారు? కేవలం నగదు రూపంలోనే లావాదేవీలు ఎందుకు నిర్వహించారు? అనే అంశాలపై ఈడీ అధికారులు ఆరా తీశారు. ముఖ్యంగా పాప్యులర్ బ్రాండ్లను కాదని, కొత్త బ్రాండ్లకు అనుమతులు ఇవ్వడం వెనుక ఉన్న కారణాలపై సమాచారాన్ని రాబట్టేందుకు ఈడీ అధికారులు ప్రయత్నించారు.. ఈ కుంభకోణం వల్ల ప్రభుత్వ ఖజానాకు సుమారు రూ. 4,000 కోట్ల నష్టం వాటిల్లిందని ఈడీ ప్రాథమికంగా అంచనా వేసింది. అక్రమ సొమ్మును షెల్ కంపెనీల ద్వారా మళ్లించి, తిరిగి నిందితుల ఖాతాల్లోకి చేరేలా ప్రణాళిక రచించినట్లు అధికారులు గుర్తించారు. ఇప్పటికే ఈ కేసులో నిందితులైన రాజ్ కెసిరెడ్డి, వాసుదేవరెడ్డి, చాణక్యలకు చెందిన రూ. 441 కోట్లకు పైగా విలువైన ఆస్తులను ఈడీ అటాచ్ చేసింది.

## రాజ్యసభ సభ్యులుగా వేం నరేందర్ రెడ్డి, అభిషేక్ సింఘ్వీ ఏకగ్రీవం

- మొదటి పేజి తరువాయి

అందించారు. ఈ సందర్భంగా వేం నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, రాజ్యసభ సభ్యుడిగా అవకాశం కల్పించిన ఏఐసీసీ పెద్దలు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ సమస్యలను రాజ్యసభలో, ఢిల్లీలో వినిపించి వాటిని పరిష్కరించే విధంగా కేంద్రంపై ఒత్తిడి తీసుకువస్తానని అన్నారు.

## రఘురామ కస్టోడియల్ టార్చర్ కేసు... సునీల్ నాయక్ విచారణ పొడిగింపు



ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు కస్టోడియల్ టార్చర్ కేసులో ఐపీఎస్ అధికారి ఎం. సునీల్ నాయక్ ఐదో రోజు విచారణ ముగిసింది. గుంటూరులోని సీసీఎస్ పోలీస్ స్టేషన్‌లో విచారణ అధికారి, విజయనగరం ఎస్పీ దామోదర్ ఆయనను ప్రశ్నించారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు.. దాదాపు ఏడు గంటల పాటు ఈ విచారణ కొనసాగింది. సీసీఎస్ స్టేషన్‌కు తరలించడానికి ముందు, సీఐడీ ప్రాంతీయ కార్యాలయంలో రఘురామ కస్టోడియల్ టార్చర్ ఘటనకు సంబంధించి పోలీసులు సీన్ రీక్రియేషన్ చేసినట్లు సమాచారం. గతంలో హైకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు మార్చి 5 నుంచి 9వ తేదీ వరకు ఐదు రోజుల పాటు సునీల్ నాయక్ పోలీసుల విచారణకు హాజరయ్యారు. సోమవారంతో ఈ విచారణ ముగుస్తుందని అంతా భావించారు. అయితే, సునీల్ నాయక్ దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై హైకోర్టులో సోమవారం విచారణ జరిగింది. ప్రభుత్వం తరపు న్యాయవాదులు తమ వాదనలు వినిపించగా.. సునీల్ నాయక్ తరపు న్యాయవాదులకు వాదనలు వినిపించేందుకు న్యాయస్థానం మార్చి 12 వరకు అవకాశం కల్పించింది.

విచారణ అధికారి కోరిక మేరకు, మార్చి 12 వరకు విచారణకు హాజరుకావాలని హైకోర్టు సునీల్ నాయక్‌ను ఆదేశించింది. దీంతో మరో మూడు రోజుల పాటు ఆయనను విచారించేందుకు అధికారులు సిద్ధమయ్యారు. గత ప్రభుత్వ హయాంలో రఘురామకృష్ణరాజు సీఐడీ కస్టడీలో ఉన్నప్పుడు కాళ్లు వాచి, నడవలేని స్థితిలో కోర్టుకు హాజరైన ఘటన ఈ కేసుకు ప్రధాన కేంద్రం అన్న విషయం తెలిసిందే.

## ఇండియా టీం టి20 వరల్డ్ కప్ గెలవడం పట్ల సంబరాలు చేసుకున్న యువత

**తాళ్ళపూడి, పెన్ పవర్, మార్చి 9:**ఇండియా టీమ్ టి20 వరల్డ్ కప్ గెలవడంపై పైడిమెట్ట యువత విజయోత్సవ సంబరాలు చేసుకున్నారు. పైడిమెట్టలో ప్రత్యేక భారీ స్క్రీన్ ఏర్పాటు చేసి మ్యాచ్ ను తిలకించారు. ఇండియా జట్టు గెలిచిన అనంతరం పైడిమెట్ట నుండి తాళ్ళపూడి వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. తాళ్ళపూడిలో టపాసులు కాల్చి సంబరాలు చేసుకున్నారు. భారత్ మాతాకి జై అంటూ పెద్ద ఎత్తున నినాదాలతో, డప్పుల శబ్దాలతో హోరేత్తించారు. కేకు కట్ చేసి తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు.



పెన్ పవర్
పోలవరం - ఏలూరు
తూర్పుగోదావరి - పశ్చిమ గోదావరి

## ప్రతి సంఘటనను చిల్లర రాజకీయాలు చేస్తున్న వైకాపా



- మహిళల భద్రత కోసం కూటమి ప్రభుత్వం కృషి
- బాధితుడికి మెడికల్ బిల్లు భవాని చారిటబుల్ ట్రస్ట్ తరపున చెల్లిస్తాం
- బాధితులను పరామర్శించిన అనంతరం మీడియాతో ఎమ్మెల్యే వాసు

**రాజమహేంద్రవరం , పెన్ పవర్,మార్చి9:** ఏ సంఘటన జరిగినా వైసిపి వాళ్ళు చిల్లర రాజకీయాలు చేస్తున్నారని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ విమర్శించారు. ఎక్కడైనా దురదృష్టకర సంఘటన జరిగితే సానుభూతి సహాయం పడాల్సింది పోయి భిన్నంగా వైసిపి వాళ్ళ వ్యవహార శైలి ఉందని ఆయన ఎద్దేవా చేసారు. ఇటీవల మ్యారేజి బ్యూరో నిర్వాహకుడు పై జరిగిన దాడితో గాయపడి యూనివర్శల్ హాస్పిటల్లో చికిత్స పొందుతున్న విజయ కుమార్ ను, అతని కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పరామర్శించి హాస్పిటల్ వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. బొల్లినేని ఆసుపత్రిలో నాగాంజలి అనే ఫార్మశీ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటనలో ఆమె కుటుంబ సభ్యులను ఆర్థికంగా ఆదుకుంటామని హామీ ఇచ్చినమేరకు జనసేన పార్టీ సిటీ ఇన్‌ఛార్జ్ అనుశ్రీ సత్యనారాయణ తో కలిసి నాగాంజలి తండ్రికి రెండు లక్షల రూపాయలను భవాని చారిటబుల్ ట్రస్టు తరపున అందజేశామని ఎమ్మెల్యే వాసు తెలిపారు. సంఘటన జరిగినపుడు నగర వైసిపి నాయకులు అల్లరి చేసి, జగన్మోహన్ రెడ్డి దగ్గరకు తీసుకెళ్లి సాయం చేయలేదని, అధికారం ఉంటేనే సాయమా, అధికారం లేకపోతె మీకు అవసరం లేదా ప్రశ్నించారు. ఆదివారం విజయకుమార్ అనే వ్యక్తిపై ఏడిద అప్పారావు అనే వ్యక్తి దాడి చేసి గాయపరచడం దారుణమని ఎమ్మెల్యే వాసు అన్నారు. గతంలో ఇదే అప్పారావు అనేక దాడులు చేస్తే ఎందుకు చర్యలు తీసుకోలేదని ఆయన ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అతడిపై రౌడీ షీట్ ఓపెన్ చేయించామన్నారు. ఇప్పుడు చేసిన దాడికి అరెస్టు చేసి రిమాండ్ కి పంపించామన్నారు. గత ప్రభుత్వంలో లాగా తప్పుచేసిన వారికి మద్దతు ఇచ్చేది లేదని ఎమ్మెల్యే వాసు స్పష్టంచేసారు.

అల్లరిమూకలపై రౌడీషీట్స్ ఓపెన్ చేసి, కౌన్సిలింగ్ ఇస్తున్నారని, ప్రవర్తన మారకపోతే కఠిన చర్యలు ప్రభుత్వం తీసుకుంటోందని అన్నారు. దాడిలో గాయపడినవారిని పరామర్శిం చలేకపోయారన్నారు. ఈ దాడిలో గాయపడి చికిత్స పొందుతున్న వ్యక్తికి అయ్యే మెడికల్ బిల్లు మొత్తం భవాని చారిటబుల్ ట్రస్ట్ తరపున చెల్లిస్తామన్నారు. ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి కూడా సాయం అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. నగరంలో శాంతిభద్రతల పరిరక్షణకు కూటమి ప్రభుత్వంలో పోలీసులు కృషి చేస్తున్నారని వాసు అన్నారు.

**ఎమ్మెల్యే వాసుకి కృతజ్ఞతలు**

రాజకీయాలకు అతీతంగా సాయం అందించి భరోసా ఇచ్చినందుకు ఎమ్మెల్యే వాసుకి బాధితుడి భార్య సుంకర అన్నపూర్ణ కృతజ్ఞతలు తెలిపారు. తన భర్తపై దాడిచేసిన వ్యక్తి పై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. తమ ఇంట్లో ప్రాణభయం ఉందని, దాడి చేసిన వ్యక్తి వెనుక ఉన్న వాళ్లందరినీ బయటకు రప్పించాలన్నారు. ఉమ్మడి కరెంట్ లో ఉన్న చిన్న లైట్ కోసం వచ్చిన గొడవతో తమపై దాడికి దిగారని చంపేస్తామని బెదిరిస్తున్నారని ఆమె ఆందోళన వ్యక్తంచేశారు. మహిళల పై గౌరవం లేకుండా ప్రవర్తించాడని ఆమె కన్నీటి పర్యంతమయ్యారు. టీడీపీ నాయకులు, కొయ్యల రమణ , మోకమాటి సత్యనారాయణ, కార్యకర్తలు ఎమ్మెల్యే వాసు వెంట ఉన్నారు.

## బి.జె.పి.ఓ.బీ.సీ.మోర్చానాయకులు ఆధ్వర్యంలో బిజెపి జెండా రెపరెప

### మారేడుమిల్లి,బి.జె.పి.ఓ.బీ.సీ.మోర్చానాయకులు



**వి.ఆర్.పురం మారేడుమిల్లి,పెన్.పవర్.మార్చి.9**

మండలంలోని మారేడుమిల్లి,గ్రామంలో సోమవారం మహిళా దినోత్సవం సందర్భంగా పోలవరం జిల్లా ఉపాధ్యక్షులు ఏగి వీర్రాజు,మారేడుమిల్లి మండల ప్రెసిడెంట్,బి.లోకేష్,మారేడుమిల్లి సెక్రెటరీ ఏగి సాంబశివరావు,ఆధ్వర్యంలోబిజెపి నాయకులను అధ్యక్షులను ఆహ్వానించడం జరిగింది.బి.జె.పి.పార్టీ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా ఇన్చార్జి గంగాధర్,మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ రెడ్డి,పాల్గొని, మాట్లాడారు.బి.జె.పి.ఓ.బి.సి.మోర్చా జిల్లా అధ్యక్షులు ఐ.వి.వి.ప్రసాద్ ఆధ్వర్యంలో పోలవరం జిల్లాలో ఉన్న మండలాల్లో ఓ.బి.సి.మోర్చా ఇన్చార్జి,లను నియ మిం చడం జరిగింది.అనంతరం మహిళల దినోత్సవం సంద ర్భంగా ఉపాధ్యక్షులు వేగి వీర్రాజు,మండల ప్రెసిడెంట్ బి.లోకేష్,ద్వారా మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ,ప్రవేశపెట్టినపథకాలకు దేశానికి చేస్తున్న సేవలకు ఆకర్షితులైన,బసవ బుజ్జి గారావు,బసవ మణికంఠ సాయి శేఖర్,బసవ లక్ష్మి, గణపతి అక్క లింగం,తుమ్మిడి లక్ష్మి నారాయణ,గంధం వెక్కన్న,షేక్ కాజ రాంతుళ్ళ,అనే కార్యకర్తలు బీజేపీ ఓబీసీ మోర్చా,నాయకులు ఆధ్వర్యంలో బి.జె.పి పార్టీ కదువా వేసి పార్టీ లోనికి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో సూర్య చంద్ర రావు,జి.ఎస్.జిల్లా ఉపాధ్యక్షులు వీరబాబు,మమ్మీ శ్రీను, మురళీ,దుర్గాప్రసాద్,నాగమణి,కారే లక్ష్మీ,అడప సతీష్,గాన జయమ్మ తదితరులు పాల్గొన్నారు.



## కోరుకొండ నూతన ఎస్ ఐ అంకారావు

## ను కలిసిన తెలగంశెట్టి, కటకం..



**కోరుకొండ, పెన్ పవర్, మార్చి 9:** కోరుకొండ నూతన ఎస్ ఐ అంకారావును తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు( కాపవరం మాజీ సర్పంచ్) తెలగశీశెట్టి శ్రీను, కటకం చలం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా నాయకులు ఎస్ఐకి చిరు సత్కారం చేశారు.

## స్ప్రింగ్ షెడ్‌ల అభివృద్ధి కోసం పరిశీలన



**గంగవరం, పెన్ పవర్, మార్చి 9:**పోలవరం జిల్లా గంగవరం మండలం ఎండపల్లి పంచాయితీ పరిధిలోని చిన్న అడ్డపల్లి గ్రామంలో ఉన్న స్ప్రింగ్ షెడ్‌ల అభివృద్ధి కోసం నిపుణుల బృందం సోమవారం స్థల పరిశీలన నిర్వహించింది. మహారాష్ట్ర రాష్ట్రం పూణే కేంద్రంగా పనిచేస్తున్న ఆక్వాడామ్ సంస్థకు చెందిన సైంటిస్టు కునాల్ సారథ్ ఉపాసనీ సారథ్యంలో రీసెర్చ్ ఫెలో కుమారి రాజేశ్వరీ సుహాస్ బోస్లే బట్టకొండ ప్రాంతంలోని "వాదన లోద్ది" ప్రాంతంలో ఉన్న స్ప్రింగ్ షెడ్‌ను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆ ప్రాంతంలో ఉన్న నీటి వనరుల పరిస్థితులు, వాటి అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై సమగ్రంగా అధ్యయనం చేశారు. పరిశీలన అనంతరం ప్రభుత్వానికి నివేదిక సమర్పించనున్నట్లు వారు తెలిపారు. అలాగే ఇదే పంచాయితీకి చెందిన వెదుళ్ల కొండ వాగు ప్రాంతంలో ఉన్న మరో స్ప్రింగ్ షెడ్‌ను కూడా వారు పరిశీలించారు.

స్ప్రింగ్ షెడ్‌ల అభివృద్ధి ద్వారా భూగర్భ జల వనరులను సంరక్షించడం తో పాటు గ్రామాల్లో నీటి అందుబాటును పెంచే అవకాశం ఉంటుందని అధికారులు తెలిపారు

ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం అదనపు ప్రోగ్రామ్ అధికారి ఎం.కె.యస్. ప్రకాష్, జూనియర్ ఇంజనీర్ టి. పద్మనాభం, టి.ఏలు సి.హెచ్. రాధాకృష్ణ, కె. సీతాదేవి, ఎఫ్.ఏ. బాలరాజు, మేట్‌లు, గ్రామస్తులు పాల్గొన్నారు.





## గ్రామాల్లో చెరువు మట్టిని రైతులు ఉచితంగా తోలుకోవచ్చు..

- ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ వెల్లడి..

**కోరుకొండ, పెన్ పవర్, మార్చి 9:** గ్రామాలలో చెరువు మట్టిని రైతుల ఉచితంగా తోలుకోవచ్చును సోమవారం కోరుకొండ జనసేన పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మీడియా సమావేశం నిర్వహించి తెలియజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో రైతులు తీర్మానం చేపట్టే ప్రభుత్వ ఆదేశాలు మేరకు ఆయా కట్ట రైతుల పొలం ఎత్తు చేసుకోవడానికి గట్టులు వేసుకోవడానికి మట్టిని ఉపయోగించుకోవచ్చునని రైతులకు సూచించారు. ఏ పార్టీ నాయకులకు ఒక్క రూపాయి కూడా చెల్లిని అవసరం లేకుండా రైతులు ఉచితంగా మట్టిని తోలుకోవచ్చునని ఎమ్మెల్యే తెలిపారు.

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసీఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# రాష్ట్రంలో పాలనయే కల్తీ

### కల్తీ మరణాలన్నీ ప్రభుత్వ హత్యలే

### జగన్ , చంద్రబాబు లకు ప్రజారోగ్యం కన్నా రాజకీయాల ఎక్కువ

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, మార్చి 9 :**రాష్ట్రంలో పాలు నీళ్లు నెయ్యి నుండి మద్యం వరకు ఆహార పదార్థాలన్నీ కల్తీ మయమని చివరకు పాలన కూడా కల్తీ అయినని ఆంధ్ర ప్రదేశ్ పీసీసీ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల విమర్శించారు. గ్రామీణ ఉపాధి పథకం యాత్ర లో భాగంగా తూర్పుగోదావరి జిల్లా పర్యటన కు విచ్చేశారు. అనంతరం కల్తీ పాలు సంఘటనలో తీవ్ర అనారోగ్యం పాలయి బొల్లినేని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధిత రోగులను సోమవారం పరామర్శించారు. అనంతరం ఆమె మీడియా సమావేశంలో మాట్లాడుతూ, రాష్ట్రంలో నిత్యవసర వస్తువులను కల్తీ చేస్తు ప్రజారోగ్యాన్ని కల్తీ రాయుళ్లు దెబ్బతీస్తున్నప్పటికీ గతంలో జగన్ గాని, ప్రస్తుతం చంద్రబాబు నాయుడు లు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవని గాని ఇద్దరు దొందు దొందూ నని విమర్శించారు. పాలు కేవలం ఇథైల్ గ్లైకాల్ రసాయనం వల్లనే కల్తీ జరిగాయ న్నది ఒక కారణమైనప్పటికీ పదిమంది పైగా మృతులు చెందడానికి కారణం యూరియా లాంటి రసాయనం ఏదో కల్తీ జరిపారని ప్రభుత్వం పరీక్షలు నిర్వహించాలని దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆస్పత్రిలో రోగుల పరిస్థితి చాలా దయానియంగా చావు బతుకుల్లో వెంటిలేషన్ గా ఉండడం పట్ల హాల్ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదాలు ఎలా జరిగినా పోయిన ప్రాణాలు తీసుకురాలేమని కల్తీ పాల సంఘటనలో మృతి చెందిన కుటుంబాలకు పాతిక లక్ష రూపాయలు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

రాష్ట్రంలో ఆహార భద్ర

త శాఖ అధికారుల పర్యవేక్షణ లేదని, అధికారులు సిబ్బంది ఖాళీలను భర్తీ చేయడం లేదని. విమర్శించారు. ఉన్నవారు సైతం తూతూ మంత్రపు తనిఖీలు చేస్తూ అవినీతి అక్రమాలకు పాల్పడుతూ ముడుపుల మత్తులో పడి ప్రజా ఆరోగ్యాన్ని పణంగా పెడుతున్నారని ఆరోపించారు. కల్తీ సంఘటనల్లో మృతులన్నీ ప్రభుత్వ హత్యలేనని విమర్శించారు. వైసిపి వైసిపి జగన్ కు మృతులను పరామర్శించడం కన్నా ఆ పార్టీ సైతాన్ల వద్దకు రాజకీయ ర్యాలీలు చేయడం ఆనవాయితీ అని ఎద్దేవా చేశారు. ఇకనైనా రాష్ట్రంలో కల్తీ రాయుళ్ల పై ప్రభుత్వం ఉక్కు పాదం మోపాలని, దోషులు ఎవరైనా ఎంతటి వారైనా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రజా ఆరోగ్యాన్ని కాపాడాలని కాంగ్రెస్ పార్టీ తరపున డిమాండ్ చేశారు. పరిమళ వెంట కాంగ్రెస్ నాయకులు గిడుగు రుద్రరాజు, టి కే విశ్వేశ్వర రెడ్డి , బాలేపల్లి మురళీధర్ మార్టిన్ లూథర్, అరుణ కుమారి, సింధియా రాణి తదితరులు పాల్గొన్నారు.



పెన్ పవర్ మంగళవారం 10 మార్చ్ 2026

# ఆదివాసీల సమస్యలు పరిష్కరించాలి

* ఐటిడిఏ ఎదుట నిరసన




**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, మార్చి 9:** ఆదివాసీలకు సంబంధించిన పలు సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సిపిఐ (ఎంఎల్) వినోద్ మిశ్రా అనుబంధ ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో సోమవారం రంపచోడవరం ఐటిడిఏ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ (ఎంఎల్) వినోద్ మిశ్రా రాష్ట్ర ఆర్గనైజింగ్ కమిటీ కార్యదర్శి కోసిరెడ్డి గణేశ్వరరావు మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో ఉన్న సమస్యలను అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. రాజవొమ్మంగి మండలం బొరుకుపల్లి గ్రామంలో 24 మందికి అటవీ హక్కుల చట్టం కింద పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, గ్రామంలోని చెడిపోయిన తాగునీటి ట్యాంకును పునరుద్ధరించాలని కోరారు. చెరుకుంపాలెం పంచాయితీ బోర్నగూడెం గ్రామంలో పోడు వ్యవసాయం చేస్తున్న గిరిజన సన్నకారు రైతులకు వ్యవసాయ బోర్లు, త్రాగునీటి సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే రెండు సంవత్సరాల క్రితం నిర్మించిన 20 వేల లీటర్ల నీటి ట్యాంక్ పనిచేయకపోవడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అడ్డతీగల మండలం దొరమామిడి పంచాయితీ కినపర్తి గ్రామంలో నివసిస్తున్న కోంద్ గిరిజనులకు విద్యుత్ సౌకర్యం కల్పించాలని, అటవీ అధికారుల వేధింపులు నిలిపివేయాలని కోరారు. అడ్డతీగల మండలం అనిగేరు గ్రామానికి చెందిన 27 మంది గిరిజనులకు ఏపీ హైకోర్టు ఆదేశాల ప్రకారం ఇచ్చిన ఇండ్ల స్థలాలకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం జిల్లా నాయకులు, మండల పార్టీ నాయకులు మరియు గిరిజనులు పాల్గొన్నారు.

## రంపచోడవరంలో రెవెన్యూ క్లినిక్ -- గిరిజన భూ సమస్యల పరిష్కారానికి చర్యలు

జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం నోక్వాల్



**గంగవరం రంపచోడవరం, పెన్ పవర్ మార్చి 9 :** జిల్లాలో గిరిజనుల భూ సమస్యలు పరిష్కరించేందుకు తగిన చర్యలు చేపడుతున్నామని పోలవరం జిల్లా ఇంచార్జ్ జాయింట్ కలెక్టర్ శుభం నౌక్వాల్ తెలిపారు. సోమవారం రంపచోడవరం ఐటిడిఏ కార్యాలయ సమావేశ హాలులో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రెవెన్యూ క్లినిక్‌లో భూ, రెవెన్యూ సమస్యలపై వచ్చిన దరఖాస్తులను ఆయన పరిశీలించారు. భూ వివాదాలు, కొత్త డి-పట్టాలు, భూ సేకరణ, వెబ్‌ల్యాండ్ సమస్యలకు సంబంధించిన కౌంటర్ల వద్ద ప్రజలు సమర్పించిన దరఖాస్తులను అర్హతల ఆధారంగా వేగంగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంపచోడవరం ప్రాంతానికి సంబంధించిన రెవెన్యూ సమస్యలపై మొత్తం 7 దరఖాస్తులు అందినట్లు తెలిపారు. వీటిని ఆయా మండలాల తహసిల్దారులకు పంపించి ప్రభుత్వ నిబంధనల ప్రకారం దరఖాస్తుదారుల అర్హతలను పరిశీలించి సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రతి వారం రెవెన్యూ శాఖకు వచ్చిన దరఖాస్తులు, పరిష్కరించినవి, పెండింగ్‌లో ఉన్నవి వంటి వివరాలను అధికారులతో సమీక్షిస్తామని చెప్పారు. అదేవిధంగా ఐటిడిఏ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) కార్యక్రమంలో మొత్తం 64 దరఖాస్తులు అందినట్లు జాయింట్ కలెక్టర్ తెలిపారు. మారుమూల గ్రామాల ప్రజల వ్యక్తిగత సమస్యలను స్వీకరించి కొన్నింటిని తక్షణమే పరిష్కరించగా, మిగతా దరఖాస్తులను సంబంధిత శాఖలకు పంపించి పరిష్కార మార్గాలు అన్వేషించాలని అధికారులకు సూచించారు. దేవీపట్నం మండలం పాముగండి గ్రామానికి చెందిన కోసు జగ్గమ్మ వితంతు పింఛన్ మంజూరు చేయాలని, కోసు బాలుదొర వృద్ధాప్య పింఛన్ ఇవ్వాలని దరఖాస్తు చేశారు. నేషనల్ హైవే--516 కారణంగా ఇంటి భూమి కోల్పోయిన తనకు ప్యాకేజీ చెల్లించాలని కె. రత్నం వినతి చేశారు. వై. రామవరం మండలం జంగలతోట గ్రామంలో త్రాగునీటి సమస్య పరిష్కారానికి కొత్త వాటర్ ట్యాంక్ ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరారు. అలాగే రాజవొమ్మంగి మండలం ముల్లేరు పాలెంలో 126 కుటుంబాలకు కొత్త వాటర్ ట్యాంక్ ఏర్పాటు చేయాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు. ఇక బోరుకుపల్లి గ్రామంలో వాటర్ ట్యాంక్ మరమ్మత్తులు చేయాలని, 24 మందికి కొండపోడు పట్టాలు మంజూరు చేయాలని గ్రామస్తులు కోరారు. కినపర్తి కొత్తవీధిలో నివసిస్తున్న కుటుంబాలకు త్రాగునీరు, విద్యుత్ సౌకర్యం కల్పించాలని వినతిపత్రాలు సమర్పించారు. అడ్డతీగల మండలం అనిగేరి గ్రామంలో ఇళ్ల స్థలాలు ఇచ్చినా పట్టాలు ఇవ్వలేదని గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన శాఖ డిప్యూటీ డైరెక్టర్ రుక్మాండయ్య, పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ షరీఫ్, డీఎంహెచ్‌వో పి. సరిత, ఏజెన్సీ డీఈవో వై. మల్లేశ్వరరావు, డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ దాసరి రత్నాకరరావు, పలు శాఖల అధికారులు, తహసిల్దార్లు, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధికి మూలం విద్య. హెచ్ఎం పద్మ.





**గోపాలపురం, పెన్ పవర్, ఫిబ్రవరి 9.** విద్యార్థులు నాణ్యమైన విద్యనుఅభ్యసించి తద్వారా అనుకున్నా లక్ష్యాలను సాధించాలని గోపాలపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, క్లస్టర్ ఇంచార్జ్ వెంకట కనక పద్మ అన్నారు. మండలంలోని వాదాలకుంట గ్రామంలో సోమవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ప్రాథమిక పాఠశాల ల ప్రధానోపాధ్యాయులు కృష్ణయ్య, శ్రీనివాస్ ల ఆధ్వర్యంలో జరిగిన ఈ ప్రత్యేక ఎన్రోల్మెంట్ డ్రైవ్ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ జొన్నకూటి మన్నెమ్మ, కనక పద్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం విద్య అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నదని తెలిపారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలలకు వెళ్లి ఉపాధ్యాయులు బోధించిన పాఠ్యాంశాలను అవగతం చేసుకోవాలన్నారు. విద్యాహక్కు చట్టాన్ని అనుసరించి ఐదు సంవత్సరాలు నిండి 14 సంవత్సరాలు లోపు వయసు కలిగిన ప్రతి ఒక్కరు తప్పనిసరిగా చదువుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కావలసిన అన్ని రకాల పుస్తకాలు, ఏకరూప దుస్తులు, విద్య వస్తువులతోపాటు డొక్కా సీతమ్మ పథకము క్రింద పౌష్టికాహారాన్ని అందిస్తున్నారు అన్నారు. వాటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో అర్హత కలిగిన అనుభవజ్ఞులైన ఉపాధ్యాయ బృందం పర్యవేక్షణలో విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన ఆంగ్ల విద్యను అందించడం జరుగుతుందన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని బాల్యం నుండి వారికి విద్యతోపాటు క్రీడలు, సమాజ సేవ తదితర విషయాలపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమ బిడ్డల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని వారిని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్చి వారి జీవితాన్ని బంగారుమయం చేయాలన్నారు. కార్యక్రమంలో భాగంగా ప్లా కార్డులు చేత పట్టి నినాదాలు చేశారు. స్థానిక పంచాయతీ కార్యాలయం సమీపంలో మూడు రోడ్ల కూడలిలో మానవహారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి విజయ్ కుమార్, ఉపాధ్యాయులు ఈశ్వరి, సత్య రమేష్, భవ్య శ్రీ షఫీ, స్వాతి, సిఆర్పి కొయ్య నాగరాజు, అంగన్వాడి కార్యకర్తలు మేరీ సుశీల, ఐ సుశీల, సిహెచ్ కుమారి, సిహెచ్ వెంకటలక్ష్మి, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలతో మమేకమై వారి పక్షాన ప్రభుత్వాన్ని నిలదీద్దాం

వైసిపి బలోపేతానికి కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి



**సీతానగరం , పెన్ పవర్, మార్చ్ :9 :** కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఇరవై నెలలైనా ప్రజల్లో ఎన్నడూ చూడని వ్యతిరేకత కనిపిస్తుందని రాజానగరం మాజీ శాసనసభ్యులు మరియు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువ జన విభాగం అధ్యక్షుడు జక్కంపూడి రాజా పేర్కొన్నారు. సోమవారం నాడు సీతానగరం మండలంలోని రఘుదేవపురం సాయిబాబా కళ్యాణ మండపంలో వైయస్సార్ సిపి నాయకుల ఆధ్వర్యంలో గ్రామ కమిటీల ప్రాముఖ్యతన కార్యక్రమంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జక్కంపూడి రాజా మాట్లాడుతూ ఎన్నికలప్పుడు చేసిన సూపర్ సిక్స్ వాగ్దానాలు గాలికి ఎగిరిపోయాయనిచెప్పారు. ప్రభుత్వంలో వ్యవస్థలన్నీనీరుగారిపోయాయని, నానాటికీ అవిదిగజారిపోతున్నాయని ఆరోపించారు. వైసిపి శ్రేణులు ప్రజల తరపున గళం విప్పాల్సిన సమయం వచ్చిందన్నారు. ఈ సందర్భంగా గ్రామస్థాయి కమిటీల ఏర్పాటు గురించి చర్చించారు. పార్టీ కష్టకాలంలో జెండా మోసిన కార్యకర్తలను గుర్తుంచుకొని అందరూ ఐకమత్యంగా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పిండి రాధాకృష్ణ, ఎంపీపీ గుర్రాల జోష్న, కరుటూరి హరిబాబు, గంటా శీను, పిచ్చికుల విజయ్ కుమార్,

## ఆధునిక మహిళ ప్రపంచ చరిత్రను తిరగ వ్రాస్తుంది

* ఉమెన్స్ డే కేవలం వేడుక కాదు సామాజిక బాధ్యత - వేణుగోపాల్





**టీ నర్సాపురం, పెన్ పవర్, మార్చి 9:** నామవరం లో బంజారా భజరంగీ భేరి సంఘం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దల చేతులమీదుగా శ్రామిక మహిళలకు చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా భూక్యా వేణు గోపాల్ నాయక్ హాజరయ్యారు. ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంటా,బయటా దశావతరాలను ఒంటి చేత్తో నిర్వహించే శక్తి రూపమే స్త్రీ మూర్తి అని అన్నారు. అమ్మ నుంచి అర్ధాంగి వరకు సృష్టికి మూలం స్త్రీ, ఉమెన్స్ డే కేవలం వేడుక కాదు సామాజిక బాధ్యత అని తెలిపారు. సంఘ ప్రధాన కార్యదర్శి భూక్యా కృష్ణ నాయక్ మాట్లాడుతూ ఆధునిక మహిళలు అన్నీ రంగాల్లో దూసుకెళ్తూ ప్రపంచ చరిత్రను తిరగ రాస్తున్నారని అన్నారు.

సంఘ అధ్యక్షులు మూడు శ్రీనివాస నాయక్ మాట్లాడుతూ అవనిలో సగం అయిన మహిళలకు చట్టసభల్లో సగం స్థానాలు కేటాయించాలని, పాలక పగ్గాలు స్త్రీల చేతుల్లో వచ్చినప్పుడు దేశం నిజమైన అభివృద్దిలోకి వస్తుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో బోడా సర్వేశ్వరావు, భూక్యా నాగేశ్వరావు,బాణావతు నవీన్, బోడా గోపాల రావు, భూక్యా శ్రీరామ మూర్తి మొదలగువారు పాల్గొన్నారు.

## కూటమి ధర్మాన్ని పాటించాలి: ఎమ్మెల్యే బొలిశెట్టి.





**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. మార్చి 09:** జనసేన, టిడిపి,బిజెపి పార్టీల కలయికలో ఏర్పడిన కూటమిని ప్రజలు భారీ మెజారిటీ తో ఆదరించారని, ప్రజాభిప్రాయాన్ని గౌరవించి మూడు పార్టీల నేతలు కూటమి ధర్మాన్ని పాటించాలని శాసనసభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. పెంటపాడు మండలం రాచర్ల, పరిమెళ్ల గ్రామాల్లో సోమవారం జరిగిన 'మీభూమి- మీహక్కు' పట్టాదారు పాసుబుక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తాను పార్టీ పరంగా జనసేన ఎమ్మెల్యే అయినప్పటికీ, కూటమికి ప్రాతినిధ్యం వహిస్తున్నానని అన్నారు. ఈ విషయంలో కూటమి నేతలు, కార్యకర్తలు అవగాహనకలిగివుండాలని అన్నారు. ఎమ్మెల్యేని గౌరవించకుండా, ఎమ్మెల్యేకి తెలియకుండా అధికార కార్యక్రమాలు ఎలా చేస్తారని ఆయన ప్రశ్నించారు. కూటమి అంటే మూడు పార్టీల్లో ఒక పార్టీకి చెందిన వ్యక్తి ఎమ్మెల్యే అవుతారని మిగతా పార్టీలు గౌరవించాలన్నారు. అదే కూటమి ధర్మమని అన్నారు. టిడిపి నాయకులు, కార్యకర్తలు వివిధ ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎమ్మెల్యే దగ్గరకు వెళ్లటం వారి హక్కు అని, వారిని టార్గెట్ చేయటం సరికాదని అన్నారు. తాను అందరి పట్ల సమభావంతో వ్యవహారిస్తానని తెలిపారు. కూటమిలో ప్రోటోకాల్ ఉల్లంఘనను సహించబోనని అన్నారు. పరిమెళ్ల లో 556,రాచర్లలో 518 పాస్ బుక్కులను పంపిణీ చేశారు. అక్రమణలను తొలగించి పంటబొదెలను బాగుచేస్తామని, చెత్త డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేస్తామని గ్రామస్తులు సహకరించాలని కోరారు. అనంతరం పెంటపాడు బేసిక్ స్కూల్ లో ఏర్పాటు చేసిన అంగన్వాడీ కేంద్రాన్ని ప్రారంభించారు. మౌంజిపాడు, ఉమామహేశ్వరం గ్రామాలలో కూడా త్వరలో అంగన్వాడీ భవనాలు పూర్తిచేస్తామని తెలిపారు. ప్రీ స్కూల్ పిల్లలకు బలవర్ధకమైన ఆహారం అందించి, విద్యాబోధనచేయటానికి ఏర్పాటు చేశామని తెలిపారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య దించాలనే ఆలోచనతో పనిచేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమాలలో అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ తాడేపల్లిగూడెం కన్వీనర్ ఈతకోట తాతాజీ, ఎమ్మార్వో సునీల్, పుల్ల బాబి, పాలూరు వెంకటేశ్వరరావు, పేటిన గిరి జన కొండ్రెడ్డి రమేష్ బాబు, గట్టి రామకృష్ణ, రామ లక్ష్మణ్, పాతూరి రాంప్రసాద్ చౌదరి, కొనగళ్ల హరినాథ్, కొవ్వూరి లక్ష్మారెడ్డి, కూటమి నాయకులు పాల్గొన్నారు

# హాస్టల్ లో మెనూ అమలు చేయని వార్డెన్ పై చర్యలు తీసుకోండి.

* ఉమ్మడి తూ.గో.జిల్లా మానవ హక్కుల ఫౌండేషన్ చైర్మన్ బత్తిన



**గోకవరం పెన్ పవర్ మార్చి 09:--** గోకవరం లో ఉన్న గిరిజన సంక్షేమ బాలికల హాస్టల్ లో మెనూ సక్రమంగా అమలు చేయడంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్న వార్డెన్ పై సంబంధిత శాఖ అధికారులు చర్యలు చేపట్టాలని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మానవ హక్కుల ఫౌండేషన్ అధ్యక్షుడు బత్తిన రామకృష్ణ డిమాండ్ చేస్తున్నారు. దీనికి సంబంధించి గోకవరంలో ఆయన మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. గోకవరం స్థానిక ఆంజనేయ స్వామి గుడి సమీపంలో ఉన్న హర్షప్రియ జూనియర్ కళాశాలకు సంబంధించి గిరిజన విద్యార్థులకు రంపచోడవరం ఐటీడీఏ ఆధ్వర్యంలో సంక్షేమ హాస్టల్ ఉందని ఆ హాస్టల్లో గత కొంతకాలంగా వార్డెన్ గా పనిచేస్తున్న వ్యక్తి గిరిజన విద్యార్థినులకు పెట్టే భోజనంలో నాణ్యత లేదని నేను అమలు చేయడం లేదని ఇటీవల గోకవరం మండల పరిషత్ అభివృద్ధి అధికారి గోవిందు అకస్మిక తనిఖీలో తేటతెల్లమయ్యిందని ఒక మండల స్థాయి అభివృద్ధి అధికారి మెనూ సక్రమంగా అమలు చేయకపోవడంపై హాస్టల్ వార్డెన్ తీరుపై మండిపడ్డారని హాస్టల్ లో విద్యార్థులను నిర్లక్ష్యంగా వార్డెన్ చూస్తున్నారని నాణ్యత లేని సరుకులు పిల్లలకు వడ్డిస్తున్నారని స్టోరేజ్ లో కూడా దుర్వాసన వెదజల్లుతుందని స్వయంగా గోకవరం ఎంపీడీవో గుర్తించడం దీనికి నిదర్శనం అని బతిన రామకృష్ణ అన్నారు. మెనూ అమలు చేయడంలో వార్డెన్ నిర్లక్ష్యం చేస్తున్నారు అనడానికి ఇంతకన్నా నిదర్శనం ఏముందని దీనికి సంబంధించి గిరిజన సంక్షేమ శాఖ అధికారి రంపచోడవరం వారు స్పందించి వార్డెన్ పై చర్యలు చేపట్టాలని చర్యలు చేపట్టక పోతే మానవ హక్కుల ఫౌండేషన్ తరఫున సంబంధిత ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడం జరుగుతుందని అంతేకాకుండా చర్యలు తీసుకునే విధంగా గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లడం జరుగుతుందని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మానవ హక్కుల ఫౌండేషన్ అధ్యక్షుడు బత్తిన రామకృష్ణ తెలిపారు.

## అట్టహాసంగా మండలంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం



**వై రామవరం, పెన్ పవర్, మార్చి 9 :** మండల కేంద్రంలో ఉన్న మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయము నందు అంతర్జాతీయ మహిళా దినోత్సవం అట్టహాసంగా ఎంపీడీవో కే బాపన్న దొర ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది.

ఎంపీపీ కే ఆనందరావు మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో సాధించిన ప్రగతి విజయాలను ప్రస్తావించారు. మండల స్థాయిలో మహిళా ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు, స్వర్ణ సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన మహిళలను సత్కరించడం జరిగిందని తెలిపారు.

# ధనార్జనే ప్రధాన లక్ష్యంగా పాలకుల ఆధ్వర్యంలో రెచ్చిపోతున్న మైనింగ్ మాఫియా.

* రాజమండ్రి పి జి ఆర్ ఎస్ లో కలెక్టర్ కి ఫిర్యాదు చేసిన పాఠంశెట్టి సూర్యచంద్ర



**గోకవరం పెన్ పవర్ మార్చి 09:--**జగ్గంపేట నియోజక వర్గంలో పాలకుల ఆధ్వర్యంలో గ్రావెల్ ,మట్టి , ఇసుక అక్రమ రవాణా ద్వారా ధనార్జనే ప్రధాన లక్ష్యంగా మైనింగ్ మాఫియా రెచ్చిపోతుందని ప్రభుత్వానికి చేరాల్సిన ప్రజాధనం పక్కదారి పడుతుందని అక్రమ మైనింగ్ ఆపాలని జగ్గంపేట నియోజకవర్గం స్వతంత్ర ఎమ్మెల్యే అభ్యర్థి,పాఠంశెట్టి సూర్యచంద్ర సోమవారం తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి ఐ ఎ ఎస్ కి , మైనింగ్, రెవిన్యూ, పోలీస్ అధికారులకు వినతి పత్రాలు సమర్పించారు. అక్రమ మైనింగ్ జరిగే ప్రాంతాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి సంబంధిత శాఖ అధికారులు చిత్తశుద్ధితో పర్యవేక్షణ చేసినట్లయితే ప్రజాధనం పక్కదారి పట్టకుండా ప్రభుత్వ ఖజానాకు చేరడం ద్వారా గ్రామ పంచాయతీ లకు ఆదాయం పెరుగుతుందని సూర్యచంద్ర అధికారులకు వివరించారు. ప్రజలను మభ్యపెట్ట డానికి చేసే అరకొర తనిఖీల వల్ల ఉపయోగం ఉండదని నిజాయితీగా నిరంతర తనిఖీలు చేసి అవినీతి, అక్రమ మైనింగ్ రవాణా దారులమీద నిబంధనల ప్రకారం చట్టపరమైన చర్యలు తీసు కోవడం వల్ల అవినీతి రవాణాను అరికట్టవచ్చని పాటంశెట్టి సూర్యచంద్ర అధికారులకు తెలిపారు.

## భీమడోలు సీఐగా పీ. కృష్ణ బాధ్యతల స్వీకారం



**పెన్ పవర్, భీమడోలు -- మార్చి 09:**ఏలూరు జిల్లా భీమడోలు సర్కిల్ కార్యాలయంలో సోమవారం నూతన సర్కిల్ ఇన్స్పెక్టర్గా పీ. కృష్ణ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు భీమడోలు సీఐగా విధులు నిర్వహించిన యు.జె. విల్సన్ను ఏలూరు ఇంటెలిజెన్స్ విభాగానికి బదిలీ చేశారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బంది పీ. కృష్ణకు శుభాకాంక్షలు తెలియజేశారు.

భీమడోలు ప్రాంతంలో శాంతి భద్రతల పరిరక్షణకు కట్టుబడి పనిచేస్తానని నూతన సీఐ పీ. కృష్ణ తెలిపారు.

# గ్రాఫ్టింగ్ పద్ధతితో అధిక దిగుబడులు





**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. మార్చి 09.**గ్రాఫ్టింగ్ పద్ధతితో అధిక దిగుబడులను సాధించవచ్చని ప్రముఖ నర్సరీ యజమాని బ్రహ్మాజీ సూచించారు. ఏపీ నిట్ లోని బృందావనం క్లబ్ ఆధ్వర్యంలో హైడ్రోగ్రాఫ్ట్ పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథి బ్రహ్మాజీ మాట్లాడుతూ మొక్కలను అంటుకట్టుట ద్వారా మంచి మంచి నాణ్యమైన రకాల మొక్కలను తక్కువ సమయంలోనే అభివృద్ధి చేసుకోవచ్చని , దిగుబడులు సైతం ఆశాజనకంగా ఉంటాయని తెలిపారు. ఎటువంటి మట్టి లేకుండా మొక్కలను పెంచే ఆధునిక వ్యవసాయ విధానాన్నే హైడ్రోపోనిక్స్ అంటారని తెలిపారు. ఈ విధానంలో మొక్కలు కేవలం నీటిలోని పోషకాలను మాత్రమే గ్రహించి పెరుగుతాయన్నారు. గ్రాఫ్టింగ్, హైడ్రోపోనిక్స్ పద్ధతులు ద్వారా రైతులకు ఎంతో మేలు జరుగుతుందని, సమయం, ఖర్చులు కూడా చాలా వరకు తగ్గుతాయని వివరించారు. ముందుగా మొక్కలను ఎలా అంటు కట్టాలి అనే విధానాలతోపాటు పిపిసి పైపుల ద్వారా హైడ్రోపోనిక్స్ నమూనాను తీర్చిదిద్దారు.

ఫ్యాకల్టీ కో ఆర్డినేటర్, ఆచార్యులు డాక్టర్ టి.కార్తికేయ శర్మ మార్గదర్శకత్వంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి నవ్య, సూర్యాంశుతోపాటు 60 మంది విద్యార్థులు పాల్గొన్నారు.




# అడ్డతీగల, రాజవొమ్మంగి మండలాల సరిహద్దులో పెద్ద పులి దోబూజులాట.





* నిరంతర పర్యవేక్షణలో ఫారెస్ట్ అధికారులు...

**అడ్డతీగల, పెన్ పవర్, మార్చి 09:** ఇటీవల కాలంలో కొద్ది రోజులుగా పోలవరం జిల్లాలోని ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న పులి రాజవొమ్మంగి మండలంలో సంచరిస్తున్నట్లు అటవీశాఖ అధికారులు ధృవీకరించారు. సబ్ డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ (సబ్ డిఎఫ్ఓ) సుబ్బారెడ్డి మాట్లాడుతూ, పులి కదలికలను శాటిలైట్ ట్రాకింగ్ మరియు రేడియో కాలర్ సాయంతో నిరంతరం పర్యవేక్షిస్తున్నామని తెలిపారు.ప్రజలు ఎటువంటి భయాందోళనకు గురవ్వాల్సిన అవసరం లేదని, పులి ఇప్పటి వరకు మనుషులపై ఎక్కడా దాడి చేయలేదని, ఆయన స్పష్టం చేశారు. పులిని బంధించేందుకు 5 ప్రత్యేక బృందాలు సిద్ధంగా ఉన్నాయని, బోన్లను కూడా సిద్ధం చేశామని తెలిపారు . త్వరలోనే పులిని సురక్షితంగా పట్టుకుని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సురక్షిత ప్రాంతంలో విడుదల చేస్తామని హామీ ఇచ్చారు.అయితే పులి సంచరిస్తున్న సమీప గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సాయంత్రం 6 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు బయటకు వెళ్లవద్దని, ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలని, అటవీశాఖ తరఫున పరిసర ప్రాంత ప్రజలకు విజ్ఞప్తి చేశారు.గత కొన్ని రోజులుగా గంగవరం, అడ్డతీగల, ఏలేశ్వరం మండలాల్లో పులి జాడలు గుర్తించబడ్డాయి అన్నారు. ఇటీవల ఏలేశ్వరం మండలం జె .అన్నవరం లో గత రాత్రి గేదె, దూడపై దాడిచేగా , కృష్ణవరం వంటి ప్రాంతాల్లో ఆవు, దూడలపై దాడులు జరిగిన నేపథ్యంలో, పులి రాజవొమ్మంగి అటవీ ప్రాంతంలోకి ప్రవేశించినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. శాటిలైట్ చిత్రాలు ఆధారంగా పులి ప్రస్తుతం రాజవొమ్మంగి మండలం బోర్న గూడెం పరిసరాల్లో ఉన్న కొండ పై ఉన్నట్లు నిర్ధారణ అయింది అని సబ్ డి ఎఫ్ సుబ్బారెడ్డి తెలిపారు .అటవీశాఖ అధికారులు పులి కదలికలను గమనిస్తూ, స్థానికుల భద్రతకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఆయన తెలిపారు. అయితే పులి సంచరిస్తున్న కొండ అటువైపు రాజవొమ్మంగి మండలానికి చెందిన గ్రామాలు ఇటువైపు అడ్డతీగల మండలం లో ఉన్న కోనలోవ వీరభద్రపురం గ్రామాలకు దగ్గరగా ఉండడంతో కొనలోవ, వీరభద్రపురం గ్రామస్తులు కూడా రాత్రి వేళలో బయటకు రావద్దని, ఇళ్ల వద్ద ,చేను మకాల వద్ద లైట్లను ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. ప్రజలు శాంతంగా ఉండి, అటవీశాఖ సూచనలు పాటించాలని సుబ్బారెడ్డి కోరారు.

# నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి




**జీలుగుమిల్లి, పెన్ పవర్, మార్చి 9;** పోలవరం నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కారం ధారయ్య డిమాండ్ చేశారు. సోమవారం స్వర్ణ వారి గూడెం గ్రామ సమీపంలో నిర్వాసిత గ్రామంలో ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిపిఐ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా నిర్వాసిత గ్రామాలలో వీధి దీపాలు, డ్రైనేజీ ,మంచినీటి సౌకర్యాలు లేక నిర్వాసితులు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారని అన్నారు. ఈ ప్రభుత్వం వాటిని పరిష్కరించి నిర్వాసితులకు మెరుగైన మౌలిక వసతులు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కారం లక్ష్మి, కారం బుజ్జి ,తదితరులు పాల్గొన్నారు.

# ప్రాణాంతక క్యాన్సర్ నుండి ఆడబిడ్డలకు రక్షణగా హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ నిలుస్తుంది.....





రాష్ట్ర విప్ ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్

**తాడేపల్లిగూడెం, పెన్ పవర్ మార్చ్ 09:**సామాన్య మధ్యతరగతి కుటుంబాల ఆడబిడ్డలకు రక్షణగా కూటమి ప్రభుత్వం నిలిచేందుకు భారత ప్రధాని నరేంద్ర మోడీ దేశవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ మెడికల్ క్యాంపులను తాడేపల్లిగూడెం నియోజకవర్గ ప్రజలు సద్వినియోగపరుచుకోవాలని రాష్ట్ర విప్ ,తాడేపల్లిగూడెం శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. సోమవారం తాడేపల్లిగూడెం పురపాలక సంఘం పరిధిలోని వీకర్స్ కాలనీ, ఎన్టీఆర్ జంక్షన్, కడకట్ల ఆరోగ్య కేంద్రాలలో హెచ్‌పీవీ వ్యాక్సిన్ కార్యక్రమంలో భాగంగా 14-15 ఏళ్ల బాలికలకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ వేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ

హెచ్‌పీవీ వ్యాక్సిన్ వల్ల సర్వైకల్ క్యాన్సర్‌ను నివారిస్తుందని, దీని ద్వారా బాలికలకు మెరుగైన వైద్యం అంతుందని, తద్వారా వారి భవిష్యత్తు బంగారు బాటలా ఉంటుందని అన్నరు. ఈ వ్యాక్సిన్ 14-15 ఏళ్ల బాలికలకు వేయటం జరుగుతుందని, ప్రభుత్వ కార్యక్రమం ద్వారా ఉచితంగా వేయించుకోవడం వల్ల వేల రూపాయలు ఖర్చులు వృధా కావని గుర్తు చేశారు. సింగిల్ డోస్ టీకా కార్యక్రమం 90 దేశాల్లో అమల్లో ఉంది కాబట్టి పబ్లిక్ అర్బన్ హెల్త్ సెంటర్స్ లో ఈ వ్యాక్సిన్ ను ఉచితంగా వేయడం జరుగుతుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం యేసుబాబు, తాడేపల్లిగూడెం శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ మరియు వైద్యులు పాల్గొన్నారు.

అర్బన్ హెల్త్ సెంటర్‌లో మెడికల్ క్యాంప్ వీకర్స్ కాలనీ అర్బన్ సెంటర్‌లో పబ్లిక్ హెల్త్ వర్కర్స్, శానిటేషన్ వర్కర్స్ కోసం మెడికల్ క్యాంప్ నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ ఎం యేసుబాబు ఆధ్వర్యంలో పబ్లిక్ హెల్త్ వర్కర్స్, శానిటేషన్ వర్కర్స్‌కు మెడికల్ టెస్టులు నిర్వహించి, మెడిసిన్‌ను అందించారు. పబ్లిక్ హెల్త్ వర్కర్స్, శానిటేషన్ వర్కర్స్ వారి ఆరోగ్యాన్ని కాపాడుకోవడం చాలా ప్రాముఖ్యమని, అది పురపాలక సంఘం బాధ్యతని, మెడికల్ క్యాంప్ నిర్వహించడం ద్వారా వారి ఆరోగ్యాన్ని పరీక్షించి, మెడిసిన్‌ను అందించడం జరిగిందిని తెలిపారు. ఈ కార్యక్రమంలో వత్తనపల్లి కాశి, మున్సిపల్ కమిషనర్ ఏసుబాబు, ఎమ్మార్వో సునీల్, పుల్లా బాబి, తాడేపల్లి సూర్య కళ, పాలూరి వెంకటేశ్వరరావు, ఎంపీపీ కట్టిపోయిన వెంకటలక్ష్మి, పసల కొండ, కొనగల హరినాథ్, కొవ్వూరు లక్ష్మారెడ్డి, రామ్ లక్ష్మణ్, పాతూరి రాంప్రసాద్,బోర్రాడి శ్రీనివాస్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

# వృధావ్యయం తగ్గించి అభివృద్ధి చేద్దాం : ఎమ్మెల్యే బొలిశెట్టి



**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. మార్చి 09:** రాజకీయాల కోసం వృధా వ్యయాన్ని తగ్గించి, గ్రామాల అభివృద్ధికి సహకరించాలని శాసనసభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. తాడేపల్లిగూడెం మండలం కొమ్ముగూడెం గ్రామంలో సోమవారం 'మీభూమి –మీ హక్కు' కార్యక్రమం లో భాగంగా పట్టాదారు పాసు పుస్తకాలను పంపిణీ చేశారు.కొమ్ముగూడెం 299, పట్టెంపాలెం 404 మొత్తం 703 పాస్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపముఖ్యమంత్రి ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ 13,300గ్రామాల్లో పల్లె పండుగ చేశారని,కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమానికి ప్రథమ ప్రాధాన్యం ఇస్తుందని అన్నారు. గత వైసిపి ప్రభుత్వం లో జగన్ తన ప్రచార యావతో 900 కోట్ల రూపాయల ప్రజాధనాన్ని వృధా చేశారన్నారు. రైతుల సొంత భూములకు సంబంధించిన పత్రాలపై తన ఫోటోలు వేయించుకొని ప్రజలతో ఛీ కొట్టించుకున్నారని అన్నారు. పండించిన ధాన్యం ఎక్కడ అమ్ముకోవాలో తెలియని అయోమయ పరిస్థితి కల్పించారని అన్నారు.నేడు కూటమి ప్రభుత్వం రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టిందని అన్నారు. కొమ్ముగూడెం లో జూనియర్ కళాశాల ఏర్పాటుకు దాతలు సహకరించాలని కోరారు. రాజకీయాల కోసం వృధా ఖర్చులు తగ్గించి అభివృద్ధికి సహకరించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ఈతకోటతాతాజీ, నరసిం సోమేశ్వరరావు, గూడెం మండల జనసేన పార్టీ అధ్యక్షుడు అడపా ప్రసాద్, జడ్పిటిసి ముత్యాల ఆంజనేయులు, సూరప్పని శ్రీను, పాలూరి వెంకటేశ్వరరావు, వాడపల్లి సుబ్బరాజు, పుల్ల బాబి, తాసిల్దార్ రాజరాజేశ్వరి,,ఎండిఓ, తదితర ప్రభుత్వ అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్ లో 205 అర్జీలు



* జాయింట్ కలెక్టర్ వై మేఘా స్వరూప్

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, మార్చి 9:**సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించిన పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టమ్ (పీజీఆర్ఎస్) రెవెన్యూ క్లినిక్ కార్యక్రమాలలో ప్రజల నుండి 205 అర్జీలు స్వీకరించినట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ వై మేఘా స్వరూప్ తెలిపారు. విభాగాల వారీగా అందిన అర్జీల్లో రెవెన్యూ (రెవెన్యూ క్లినిక్) కు 87, పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖకు 57, హోం శాఖకు 11, ఎనర్జీ శాఖకు 8, మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ అర్బన్ డెవలప్‌మెంట్ శాఖకు 5, కన్స్యూమర్ అఫైర్స్, ఫుడ్ అండ్ సివిల్ సప్లైస్, ఇండస్ట్రీస్ అండ్ కామర్స్, ట్రాన్స్‌పోర్ట్, రోడ్స్ అండ్ బిల్డింగ్స్, మహిళా, శిశు, దివ్యాంగులు వృద్ధుల సంక్షేమం, పశుసంవర్ధక, పాలు మత్స్య శాఖ, పాఠశాల విద్య శాఖలకు చెంది 3 అర్జీలు చొప్పున అందాయన్నారు.

జల వనరుల, ఆర్థిక శాఖ, వ్యవసాయం, వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, మైనార్టీస్ వెల్ఫేర్ శాఖలకు చెందిన అర్జీలు స్వీకరించారు. ప్రజలు తమ సమస్యలను 1100 టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా, అలాగే మీకోసం వెబ్ పోర్టల్ ద్వారా కూడా నమోదు చేయవచ్చని జాయింట్ కలెక్టర్ తెలిపారు. అందిన అర్జీలను సంబంధిత శాఖలు సత్వరంగా పరిశీలించి పరిష్కరించేందుకు వ్యక్తిగత బాధ్యతతో పనిచేయాలని అధికారులకు జాయింట్ కలెక్టర్ వై మేఘా స్వరూప్ సూచించారు. పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని రెవెన్యూ డివిజన్ అధికారులు మండలాల వారీగా పర్యవేక్షించి సమర్థంగా పంపిణీ చేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ రెవెన్యూ క్లినిక్ ద్వారా ఆర్డీవోలు, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. జిల్లా రెవెన్యూ అధికారి టి. సీతారామమూర్తి పీజీఆర్ఎస్ ఫిర్యాదులను జిల్లా స్థాయి అధికారులతో కలిసి స్వీకరించారు.

ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజన్ అధికారులు, నియోజకవర్గాల ప్రత్యేక అధికారులు, జిల్లా స్థాయి అధికారులు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## త్వరలో కోరుకొండ టెంపుల్ రోడ్డు విస్తరణ...

కోరుకొండ బస్టాండ్ నుండి లక్ష్మీ నరసింహ స్వామి గుడి వరకు గ్రాంట్ మంజూరు అయ్యింది..

ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ వెల్లడి..



**కోరుకొండ, పెన్ పవర్, మార్చి 9:** త్వరలో కోరుకొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామి టెంపుల్ రోడ్డు విస్తీర్ణకు గ్రాంట్ మంజూరు అయ్యింది అని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోరుకొండ బస్టాండ్ నుండి శ్రీ లక్ష్మీనరసింహస్వామి కోనేరు వద్ద వరకు 12 మీటర్ల రోడ్డు విస్తరణ ఏర్పాట్లకు త్వరలో సిద్ధం చేస్తామని అన్నారు. ఇరువైపులా డ్రైనేజ్ కూడా ఏర్పాటు చేస్తారని సూచించారు. ప్రజలు ఈ విస్తరణతో ఇబ్బంది కలగకుండా ప్రయాణం చేస్తారని వ్యాపారం అభివృద్ధి చెందుతుందని గుడికి వచ్చే భక్తులకు కూడా ఇబ్బంది కలగకుండా ఉంటుందని ఎమ్మెల్యే అన్నారు. ఈ విస్తీర్ణ పనులు షాపు వర్తక సభ్యులతో చర్చించి వారికి ఇబ్బంది కలగకుండా విస్తీర్ణ చేపడతామని రోడ్డు ఆపే ప్రసక్తే లేదని ఇది ప్రజలకు భక్తులకు అందరికీ ఉపయోగకరమైన రోడ్డు అని ముఖ్యంగా స్కూల్ విద్యార్థులు టయానికి స్కూలుకు చేరుకుంటారని వ్యాపారం అభివృద్ధి చెందుతాయని ఎట్టి పరిస్థితుల్లోనూ రోడ్డు విస్తరణ ఆపడం జరగదని ఎమ్మెల్యే బత్తుల మీడియా సమావేశంలో అన్నారు.

# నేటినుంచి 14 సంవత్సరాల బాలికలకు హెచ్ పి వి వ్యాక్సినేషన్

పోస్టర్ ఆవిష్కరించిన జిల్లా జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్




**రాజమహేంద్రవరం, పెన్ పవర్, మార్చి 9** :గర్భాశయ క్యాన్సర్ వంటి ప్రమాదకర వ్యాధిని ముందుగానే నివారించేందుకు 14 సంవత్సరాల బాలికలకు ఒక డోసు హెచ్ పి వి (హ్యూమన్ పాపిలోమా వైరస్) వ్యాక్సిన్ ఇవ్వడానికి భారత ప్రభుత్వం , రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా కార్యక్రమం చేపట్టినట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్ తెలిపారు. వ్యాక్సినేషన్ పోస్టర్‌ను జిల్లా జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్ ఆవిష్కరించారు. హెచ్ పి వి వల్ల కలిగే గర్భాశయ క్యాన్సర్ ప్రధాన ప్రజారోగ్య సమస్యగా ఉండగా, టీకా ద్వారా దీనిని సమర్థవంతంగా నివారించవచ్చని ప్రజల్లో అవగాహన కల్పించడం కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమాన్ని ఫిబ్రవరి 28, 2026న భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ రాజస్థాన్‌లోని అజ్మీర్ నుంచి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజయనగరం జిల్లా చీపురుపల్లి నుంచి ప్రారంభించినట్లు డి ఎమ్ హెచ్ వో వెంకటేశ్వర రావు తెలిపారు. తూర్పు గోదావరి జిల్లాలో మంగళ వారం నుండి అన్ని పి హెచ్ సి, యు పి హెచ్ సి, కేంద్రాల్లో వ్యాక్సినేషన్ ప్రారంభించ నున్నట్లు తెలిపారు. జిల్లాలో మొత్తం 14 సంవత్సరాల బాలికలు 13,964 మందిని (గ్రామ , వార్డు సచివాలయ డేటా ఆధారంగా) గుర్తించగా, మొదటి విడతగా 7,681 డోసుల వ్యాక్సిన్ సరఫరా చేయడం జరిగిందన్నారు. 01-03-2011 నుండి 28-02-2012 మధ్య జన్మించి 01-03-2025 నుండి 28-02-2026 మధ్య బాలికలు ఈ వ్యాక్సినేషన్‌కు అర్హులని తెలిపారు. ఈనెల 7 తేదీన జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు పట్టణ ఆరోగ్య కేంద్రాలకు వ్యాక్సిన్ సరఫరా చేసినట్లు తెలిపారు.

10-03-2026 నుండి అన్ని కేంద్రాల్లో వ్యాక్సినేషన్ ప్రారంభించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయని, మెడికల్ ఆఫీసర్లు సిబ్బందికి శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. వ్యాక్సినేషన్ పూర్తిగా కోల్డ్ చైన్ పాయింట్ల వద్ద మాత్రమే నిర్వహించబడుతుందని తెలిపారు.

14 సంవత్సరాల బాలికల తల్లిదండ్రులకు ముందుగా అవగాహన కల్పించి వారి సమ్మతి తీసుకున్న తర్వాత మాత్రమే వ్యాక్సినేషన్ ఇస్తామని తెలిపారు. యు విన్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసి, ఏ బి హెచ్ ఎ ఐ డి ద్వారా మాత్రమే టీకా ఇవ్వవడం , టీకా అనంతరం సర్టిఫికేట్ కూడా జారీ చేస్తారని తెలిపారు. ఈ వ్యాక్సినేషన్ కార్యక్రమం ప్రతిరోజూ కొనసాగుతుందన్నారు.తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ జిల్లా మేజిస్ట్రేట్ ఆధ్వర్యంలో విద్యాశాఖ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఇతర లైన్ విభాగాలతో సమన్వయం చేసుకుని ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేయనున్నట్లు తెలిపారు.

వ్యాక్సినేషన్ పోస్టర్‌ను జిల్లా జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్ ఆవిష్కరించారు.

ఈ కార్యక్రమంలో ఎస్డిసి కె భాస్కర్ రెడ్డి, ఎమ్ ఆర్ ఆర్ ప్రేమ్ కుమార్, వి భాగ్యవతి, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డా. బి. శ్రీదేవి,, జిల్లా సర్వే అధికారి బి లక్ష్మీ నారాయణ, అదనపు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డా. వసుంధర, ప్రోగ్రామ్ ఆఫీసర్ డా. షమ్మీ కుమార్, ఇన్‌చార్జ్ ఐూంచీూ ఎ.వి. సత్యవతి, డిప్యూటీ డెమో పి. సత్యవతి, జనూ బి. కామేశ్వర శర్మ, వీూంజూ బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో ఈ కార్యక్రమం అమలు కోసం అవసరమైన కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేసినట్లు జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. కె. వెంకటేశ్వరరావు తెలిపారు.

## ఎస్ ఏ ఏ ఆ ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో జరిగిన మాస్టర్స్ బ్యాట్మెంటన్ పోటీలలో ఉంగుటూరు మండలం ద్వితీయ స్థానం కైవసం




**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. మార్చి 09.**నేడు ఎస్ ఏ ఏ ఆ ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో జరిగిన మాస్టర్స్ బ్యాట్మెంటన్ పోటీలలో ద్వితీయ స్థానం కైవసం చేసుకున్న ఉంగుటూరు మండల ఎంఇఓ 2 పయ్యావుల. సాయిబాబు జడ్పీ ఎచ్ ఎస్ బొమ్మిడి ఎస్ ఏ గొల్లపల్లి రామారావు ఈనెల 24, 25 వ తేదీల్లో కోనసీమ జిల్లాలోని అమలాపురంలో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించబడతాయి

ఈ పోటీలకు ఈ పోటీలను డిస్టిక్ సెలక్షన్ అథారిటీ డెవలప్మెంట్ ఆఫీసర్(డిఎస్డీఓ ) షేక్ అజీజ్ ప్రారంభించారు.

# బాలికల ఆరోగ్య భద్రతకు హెచ్ పి వి కేన్సర్ వ్యాక్సిన్ పెను ప్రమాదం

* వ్యాక్సిన్ కు అనేక దేశాలు , రాష్ట్రాలు వ్యతిరేకత
* క్లినికల్ పరీక్షలు పూర్తి కాకుండానే వ్యాక్సిన్ దేశ బాలికలపై ప్రయోగాలా !
* మోడీ, చంద్రబాబు ల తీరు పై రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ మేడా శ్రీనివాస్ ఆందోళన



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, మార్చి 9:**బిల్ గేట్స్ దేశం అమెరికాలో హెచ్ పి వి వ్యాక్సిన్ ను ఉచితంగా ఇవ్వకుండా భారతదేశం లో బాలికలకు ఎందుకు ఉచితంగా వ్యాక్సిన్ వేయాలను కుంటున్నారో కేంద్ర – రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు చెప్పాలని రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ వ్యవస్థాపక అధ్యక్షులు మేడా శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆర్పిసి ప్రధాన కార్యాలయంలో జరిగిన సభకు అర్పిసి సీనియర్ సెక్యులర్ సిమ్మా దుర్గారావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హెచ్ పి వి క్యాన్సర్ వ్యాక్సిన్ వాడుక పై ఖచ్చితమైన శాస్త్రీయ పరిశీలన ఫలితాలు లేవని, ప్రపంచ ఆరోగ్య సంస్థలు పూర్తి స్థాయి క్లినికల్ పరీక్షలు జరపకుండానే ముందుగా భారత్ లో బిల్ గేట్స్ సంస్థ వ్యాక్సిన్ ను వినియోగించా లనుకోవటం భారతదేశ బాలికలను , తల్లితండ్రులను ఆందోళనకు గురిచేస్తుం దన్నారు. కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు సైతం వ్యాక్సిన్ ఉపయోగం పట్ల ప్రజలకు భరోసా కల్పించక పోవటం ఆశ్చర్యంగా వుంద న్నారు . ప్రధాని మోదీ సొంత రాష్ట్రం గుజరాత్ , మోదీ కూటమి లో భాగస్వామి ఆంధ్రప్రదేశ్ లో చంద్రబాబు కూటమి సర్కార్ లు మాత్రమే వ్యాక్సిన్ పట్ల అత్యుత్సాహం కనపరుస్తు యన్నారు . భారత్ లో క్లినికల్ పరిశోధనలు లేకుండా ఈ వ్యాక్సిన్ ను వినియోగించడం పై డా. అభిషేక్ జిందాల్ సుప్రీం కోర్టులో సందేహాలు వ్యక్తం చేస్తు వాజ్యం దాఖలు చేసారన్నారు. మోదీ , చంద్రబాబు కూటమి సర్కార్ లకు ప్రజల ఆరోగ్య భద్రత కన్నా రాజకీయ ప్రయోజనాలే కనపడుతున్నయని, అమెరికా, యూరప్ దేశాల్లోను , ఆఫ్రికా ఖండంలోను బిల్ గేట్స్ వ్యాక్సిన్ ప్రయోగాలను ఆ దేశాల ప్రజలు వ్యతిరేకించి తరిమివేశారన్నారు. దేశంలోను అనేక రాష్ట్రాలు ఈ వ్యాక్సిన్ ను వ్యతిరేకస్తున్నాయని, ప్రజల్లో అనుమా నాలను నివృత్తి చేయకుండా మినిస్ట్రీ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ హెచ్ పి వి వ్యాక్సిన్ మంచిదే వేయించుకోండి అంటూనే, అనంతరం వచ్చే సమస్యల పై బాధిత రోగుల వైద్యనికి భరోసా ఇవ్వక పోవడం అనుమానాలను బలపరుచుతు న్నాయన్నారు. కరోనా వ్యాక్సిన్ ను జి ఎస్ టి పన్నులతో భారీ ధరలకు విక్రయించిన చరిత్ర ఉన్న ప్రభుత్వాలు హెచ్ పి వి క్యాన్సర్ వ్యాక్సిన్ ఉచితంగా ఇవ్వడం వెనుక పెద్ద కుట్రే వుందని సామాన్యులు సైతం అనుమానిస్తు న్నారన్నారు. 2009 ఖమ్మం జిల్లాలో గిరిజన పాఠశాలల్లో ఈ వ్యాక్సిన్ వేసిన తరువాత కొంతమంది బాలికలు మరణించటం, సైడ్ ఎఫెక్టు తలెత్తడం పెద్ద సంచలనం అయ్యిందని అయన గుర్తు చేశారు. యూనివర్సిటీ ఆఫ్ బ్రిటిష్ కొలంబియో కు చెందిన పరిశోధకులు వ్యాక్సిన్ లో అల్యూమినియం అడ్జువెంట్స్ ఉండడంతో నరాల బలహీనతలు వచ్చే ప్రమాదం వుందని . డా. సీన్ హంగ్లీ వ్యాక్సిన్ లో ఉండకూడని హెచ్ పి వి

డి ఎన్ ఏ ముక్కలు మిగిలి పోయాయని, అవి రోగనిరోధక శక్తిని నిర్వీర్యం చేస్తాయని వాదిస్తున్నారన్నారు. ఆ ముక్కలు తక్కువ పరిణామం లోనే వున్నాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ చెప్పటం బట్టి వ్యాక్సిన్ పూర్తి భద్రత కాదని తెలుస్తోందన్నారు. జపాన్ కు చెందిన డా. మాసో కో తానియా బృందం కూడా ఈ వ్యాక్సిన్ వేసుకున్న బాలికల్లో క్రానిక్ పెయిన్, ఇతర అనారోగ్య సమస్యలు వస్తున్నాయని తెలిపారన్నారు. కొంతమంది శాస్త్రవేత్తలు ఈ వ్యాక్సిన్ లో పోస్ట్రల్ ఆర్థోస్టాటిక్ టై కార్డియా సిండ్రోమ్ (పాట్స్) , గిలియన్ బార్ సిండ్రోమ్ వంటి అరుదైన సమస్యలు వున్నాయని ఆందోళన చెందుతు న్నారన్నారు. గర్భశయ కేన్సర్ ను పూర్తిగా నిరోదించటంలో ఈ వ్యాక్సిన్ పై మరిన్ని స్వతంత్ర అధ్యాయనాలు జరగాలని కొంతమంది శాస్రజ్నులు కోరుతున్నారు. పూర్తి పరీక్షలు కానీ హెచ్ పి వి వ్యాక్సిన్ ను కొంతకాలం పాటు దేశంలో వినియోగించ కుండా భారత ప్రభుత్వం కఠినమైన ఆదేశాలు జారీ చేయాలని, ఈ వ్యాక్సిన్ వేసుకుంటే ఎటువంటి అనార్దాలు కలగవని , అనుకోని దుష్ఫలితాలు సంభవిస్తే , వ్యాక్సిన్ వేయించుకున్న 5 ఏళ్ల వరకు ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని, ఈ వ్యాక్సిన్ ఖచ్చితత్వం , భద్రత, శాస్త్రీయత పూర్తిగా నిరూపితమైన తరువాతనే వినియోగించాలన్నారు. వ్యాక్సిన్ వేసుకున్న బాలికలకు చట్ట భద్రత హక్కును కల్పిస్తు మోదీ – చంద్రబాబు కూటమి సర్కార్ లు లిఖితపూర్వక ప్రమాణ పత్రం అధికారికంగా జారీ చేసిన తదుపరి భారతదేశ బాలికలకు వ్యాక్సిన్ టీకాలను వినియోగించాలని అర్పిసి అధ్యక్షులు మేడా శ్రీనివాస్ కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ సభ లో అర్పిసి సెక్యులర్స్ డి విరమణ. మూర్తి , దుడ్డే త్రినాద్ , వర్ధనపు శరత్ కుమార్ గు డ్ల సాయి దుర్గా ప్రసాద్ , బసా సోనియా, మేకల కిరణ్ కళ్యాణ్ , కందివలస రమణ , కేశవరావు , సింహాద్రి తిలక్ , కే. గోపి , నిర్మలా రూతు తదితరులు పాల్గొన్నారు .

## ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడానికి తనవంతు కృషి.

* పలువురిని పరామర్శించిన వైసీపీ నాయకులు మురళీ కృష్ణంరాజు

**కిర్లంపూడి, పెన్ పవర్, మార్చి 09:** ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడానికి తనవంతు కృషి చేస్తానని ప్రత్తిపాడు నియోజకవర్గ వైసీపీ నాయకులు, నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గం పరిశీలకులు,ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత ముదునూరి మురళీ కృష్ణంరాజు అన్నారు.మండలంలోని ధర్మవరం గ్రామంలో చిలకలపల్లి రాంబాబు భార్య రమాదేవి ఇటీవల ఆకాల మృతి చెందారు.దీంతో విషయం తెలుసుకున్న మురళీకృష్ణంరాజు వారి కుటుంబాన్ని పరామర్శించి రూ.ఐదు వేలు ఆర్థిక సాయం అందించారు.భవిష్యత్తులో రాంబాబు ఇద్దరు పిల్లలకు ఏ అవసరం వచ్చినా తమ ట్రస్ట్ నుండి ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.అలాగే మద్రి రాముడు భార్య లక్ష్మి కుటుంబాన్ని,తూపాటి బుల్లచ్చయ్య భార్య పల్లయమ్మ కుటుంబీకులను కూడా పరామర్శించి ఆయా కుటుంబాల వారికి ప్రగడ సానుభూతి తెలిపారు.ఈ కార్యక్రమంలో కోలా తాతబాబు,బొల్లు నాగేశ్వరరావు,పోకనాటి శేషయ్య,మద్రి సుబ్బారావు,పోకనాటి నూకరాజు,జువ్వల దొరబాబు,దాడి పుత్తయ్య తదితరులు పాల్గొన్నారు

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District, Andhrapradesh -533003 Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

# మహిళలు అవకాశాలు అందిపుచ్చు కోవడం కాదు సృష్టించే వారిగా ఎదగాలి






03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి


**ఎస్.టి.ఎఫ్.ఐ జాతీయ కార్యదర్శి ఎన్ అరుణ కుమారి పిలుపు**

**గంగవరం, పెన్ పవర్, మార్చి 9:** సోమవారం స్థానిక మండల విద్యా వనరుల కేంద్రం గంగవరంలో యుటిఎఫ్ గంగవరం మహిళా విభాగం ఆధ్వర్యంలో యూటిఎఫ్ మహిళా అధ్యక్షురాలు ఎల్ రుక్మిణి దేవి అధ్యక్షతన జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలలో విశిష్ట అతిథిగా విచ్చేసిన స్కూల్ టీచర్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా కార్యదర్శి, జాతీయ కార్యదర్శి ఎన్ అరుణ కుమారి మాట్లాడుతూ నేటి మహిళలు అవకాశాలను అందిపుచ్చుకోవడంలో కాదు అవకాశాలను సృష్టించే దిశగా ఆకాశమే హద్దుగా ఎదగాలని అన్నారు. పురుషులు మహిళలు అనే భేదాన్ని మరిచి మనందరం మొదట మనుషులుగా జన్మించామని మనల్ని మనం మొదట గౌరవించుకోవాలని అప్పుడే సమాజంలో అంతరాలు తొలిగి సమ సమాజ స్థాపన జరుగుతుందని ఆమె అన్నారు.ఆదిమ కాలంలో మొదట గుంపులుగా ఉన్న సమూహాన్ని మహిళలే నడిపించే వారిని కానీ తర్వాత కాలంలో మహిళలను కేవలం పునరుత్పత్తి సాధనాలుగా పురుష సమాజం మార్చి వేసిందని నేటికీ అదే తీరు కొనసాగుతుందని దాని నుండి బయటపడి స్వతంత్ర ఆలోచన శక్తి కలిగిన వారిగా ఎదగాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గౌరవ అతిధులు గా హాజరైన గంగవరం మండలం జడ్పిటిసి బేబీ రత్నం మాట్లాడుతూ మహిళలు కుటుంబాన్ని, సమాజాన్ని ప్రేమించడంతో పాటుగా తమల్ని తాము గౌరవించుకోవాలని మనం బాగున్నప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుంది,బాగుంటుందని అన్నారు.మరొక ముఖ్య అతిథి తీగల ప్రభ మాట్లాడుతూ సమాజం కోసం పాటుపడే మహిళలు తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని మనం ఆరోగ్యం గా ఉన్నప్పుడే కుటుంబం ని సక్రమంగా నడపగలుగుతామని అన్నారు. గంగవరం మండలం సిడిపిఓ సుచరిత ఆదిలక్ష్మి మాట్లాడుతూ ఈ సంవత్సరం మన గంగవరం మండలం నుండి మహిళా సమాజానికి అందరికీ మూడు అంశాలపై పిలుపునిద్దామని ఒకటి అందంగా ఉండటం రెండవది ఆరోగ్యం గా ఉండడం మూడవది సంతోషంగా ఉండడం అని అన్నారు.ఈ సందర్భంగా మండలంలోని వివిధ సామాజిక అంశాల పై ప్రజలకునిస్వార్థం గా సేవ చేస్తున్నటువంటి స్థానిక సర్పంచ్ కలుముల అక్కమ్మ, మాజీ ఎం. పి. పి. తీగల ప్రభ, సీనియర్ ఉపాధ్యాయురాలు ఎస్ సునీతా కుమారి లను సన్మానించారు.పిమ్మట అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జరిగిన ఆటల పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.

ఈ కార్యక్రమంలో గంగవరం మండలం విద్యాశాఖధికారి శ్రీ టి. మల్లేశ్వర రావు గారు, యూటిఎఫ్ పోలవరం జిల్లా ప్రధాన కార్యదర్శి కె. కృష్ణ, బిజెపి నాయకురాలు కుంజం సత్యనారాయణమ్మ గారు, యూటిఎఫ్ మహిళా అధ్యక్షురాలు ఎల్ రుక్మిణీదేవి మండల మహిళా కన్వీనర్ కారం.లక్ష్మి, జిల్లా కౌన్సిలర్ బి. వంశీ ప్రియ, సీనియర్ ఉపాధ్యాయినులు పి. ఉమాదేవి, ఎస్. సునీతా కుమారి, 50 మంది మహిళలు పాల్గొన్నారు.

## పెనికేరు గ్రామంలో రూ.25 లక్షలతో సిసి రోడ్ల నిర్మాణం

* స్వయంగా పనులు పర్యవేక్షించిన ఎంపీడీవో ఏ. రాజు



**ఆలమూరు, పెన్ పవర్, మార్చి 09;** ఆలమూరు మండలం పెనికేరు గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మంజూరైన రూ. 25 లక్షల నిధులతో సిసి రోడ్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ఎంపిడివో ఏ రాజు తెలిపారు. గ్రామ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని చేపట్టిన ఈ పనులను ఎంపీడీవో స్వయంగా దగ్గరుండి పర్యవేక్షిస్తూ పనుల నాణ్యతపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. గ్రామ ప్రజలకు సౌకర్యవంతమైన రవాణా సదుపాయాలు కల్పించాలనే లక్ష్యంతో ఈ సిసి రోడ్ల నిర్మాణాన్ని చేపట్టినట్లు ఆయన తెలిపారు. రోడ్లు పూర్తయిన తర్వాత గ్రామంలో వర్షాకాలంలో ఎదురయ్యే బురద సమస్యలు తగ్గడంతో పాటు ప్రజలకు సులభంగా రాకపోకలు సాగించడానికి వీలవుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి నిధులను సమర్థంగా వినియోగించి గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని, నిర్మాణ పనులు నాణ్యతతో పాటు సమయానికి పూర్తి చేయాలని సంబంధిత సిబ్బందికి సూచించారు.పెనికేరు గ్రామస్తులు కూడా గ్రామ అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలపై సంతోషం వ్యక్తం చేస్తూ, స్వయంగా పనులను పర్యవేక్షిస్తూ గ్రామాభివృద్ధికి కృషి చేస్తున్న ఎంపీడీవో ఏ. రాజు సేవలను అభినందించారు. గ్రామంలో ఇలాంటి అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగాలని కోరుకున్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి,సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

## ఆదిత్య డిగ్రీ పీజీ కళాశాలలో ఘనంగా 'ఆరా--2026' కార్యక్రమం




**కాకినాడ, పెన్ పవర్,మార్చి 9:** ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాలల కామర్స్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన "ఆరా--2026" కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యార్థులు వివిధ సృజనాత్మక మరియు విద్యా సంబంధిత పోటీలలో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు.

ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి.ఈ.వి.ఎల్. నాయుడు మాట్లాడుతూ, ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచి భవిష్యత్ వృత్తి జీవితానికి దోహద పడతాయని తెలిపారు.ముఖ్య అతిథిగా హాజరైన చార్టర్డ్ అకౌంటెంట్ వి.సందీప్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు నైపుణ్యాలు, సృజనాత్మకత మరియు కమ్యూనికేషన్ స్కిల్స్‌ను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా బిజినెస్ క్విజ్, హెచ్ఆర్, ఐపీఎల్ బిడ్డింగ్ వంటి పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన కామర్స్ విభాగాన్ని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణా రెడ్డి అభినందించారు.ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, కామర్స్ విభాగాధిపతి డాక్టర్ ఎస్.ఏ.జి. అన్సర్ అలీ, అధ్యాపకులు శ్రీమతి అపర్ణ స్రవంతి, పి. నరసింహారావు, ఎం. రమణి తదితరులు పాల్గొన్నారు.

## పెద్దపులి సంచారం.. గిరిజన గ్రామాల్లో భయాందోళనలు






**గంగవరం/రాజవొమ్మంగి, పెన్ పవర్, మార్చి 9:** మండలంలోని బోర్నగూడెం గ్రామ పరిసరాల్లో సోమవారం ఉదయం పెద్దపులి సంచారం గుర్తించబడడంతో గిరిజన గ్రామాల ప్రజల్లో భయాందోళనలు నెలకొన్నాయి. సోమవారం తెల్లవారుజామున జె అన్నవరం సమీపంలో కట్టి ఉన్న గేదెపై పెద్దపులి దాడి చేసింది. అక్కడనుండి తప్పించుకున్న పులి ఉర్లాకపాడు బోర్నగూడెం అటువీ ప్రాంతంలోకి తప్పించుకున్నట్లు సమాచారం .అటవీశాఖ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం పెద్దపులికి అమర్చిన రేడియో కాలర్ సంకేతాల ద్వారా ఉదయం సుమారు 11 గంటల సమయంలో బోర్నగూడెం గ్రామ శివారులో పులి కదలికలను గుర్తించారు.ఈ సమాచారం అందడంతో అటవీశాఖ అధికారులు, రెవెన్యూ మరియు పోలీసు అధికారులు అప్రమత్తమయ్యారు. అడ్డతీగల సబ్ డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ (ఎస్‌డీఎఫ్) సుబ్బారెడ్డి బోర్నగూడెం గ్రామంతో పాటు సమీప గ్రామాల్లో పర్యటించి పరిస్థితిని సమీక్షించారు. గ్రామస్తులు జాగ్రత్తగా ఉండాలని, అడవిలోకి పశువులను వదలకూడదని, ఎవరూ ఒంటరిగా అడవివైపు వెళ్లకూడదని సూచించారు.పులి సంచారం నేపథ్యంలో బోర్నగూడెం, చెరుకుంపాలెం, సంజీవనగరం, మిరియాలవీధి గ్రామాల్లో అటవీశాఖ అధికారులు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. త్వరలోనే పులిని సురక్షితంగా పట్టుకునేందుకు చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.ఈ సందర్భంగా తహశీల్దార్ అల్లూ సత్యనారాయణ, అటవీశాఖ రేంజ్ అధికారిణి ఉషారాణి, ఎస్ఐ చినబాబు, ఏఐఐసి డైరెక్టర్ గొల్లపూడి పెద్దిరాజు, పులి రక్షణ బృందం సభ్యులు తదితరులు అక్కడ పరిస్థితిని పరిశీలించారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని గ్రామస్థులకు సూచిస్తూ పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

## ఘనంగా శ్రీ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ

**విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం లో మాజీ ఎమ్మెల్యే శీతంశెట్టి వెంకటేశ్వరరావు**



**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, మార్చి 9:** పోలవరం జిల్లా రంపచోడవరం నియోజకవర్గంలోని మారేడుమిల్లి మండలం రామన్నవలస గ్రామంలో శ్రీ శ్రీ శ్రీ ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం సోమవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే శీతంశెట్టి వెంకటేశ్వరరావు హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.పూజారులు వేదమంత్రోచ్చారణల మధ్య ఆంజనేయస్వామి విగ్రహాన్ని ప్రతిష్టించగా గ్రామస్తులు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై భక్తి భావంతో కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే శీతంశెట్టి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని పెంపొందించేలా ఆంజనేయస్వామి ఆలయం నిర్మాణం జరగడం ఆనందదాయకమని తెలిపారు. గ్రామ ప్రజలు ఐక్యంగా ఉండి అభివృద్ధి దిశగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కరాటే పోటీలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు అభినందన




**ఆలమూరు, పెన్ పవర్, మార్చి 09;** ఈనెల 8వ తేదీన గుంటూరు జిల్లా చిలకలూరిపేటలో వాసవి గార్డెన్ ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన అంతర్జాతీయ ఓపెన్ కరాటే మార్షల్ ఆర్ట్స్ పోటీలలో అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తూరు సెంటర్ బ్లూ బెల్స్ ఇంగ్లీష్ మీడియం స్కూలు విద్యార్థులు ప్రతిభ చూపి బహుమతులు గెల్చుకున్నారు. ఆయా విభాగాల్లో భాగంగా ఏ విభాగంలో బొక్క మౌనిక శ్రీలత సిల్వర్ మెడల్, సి విభాగంలో కాశి సౌమ్య బ్రాంజ్ మెడల్, అదేవిధంగా డి విభాగంలో అడాల అరహ బ్రాంజ్ మెడల్, సాధించినట్లు మార్షల్ ఆర్ట్స్ గ్రాండ్ మాస్టర్ టి అబ్బులు తెలిపారు. విజయం సాధించిన విద్యార్థులను సోమవారం స్కూల్ కరస్పాండెంట్ ఇడుపుగంటి పద్మావతి,కోచ్ వెంకటలక్ష్మి, స్కూలు టీచర్స్, తదితరులు అభినందించారు

# గ్యాస్ ధరల పెంపుపై సీపీఎం నిరసన గళం

**పెద్దాపురం, పెన్ పవర్, మార్చి 9 :** వంటగ్యాస్ ధరలను పెంచుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత నిర్ణయం సామాన్యుడి పాలిట శరాఘాతంలా మారిందని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు నీలపాల సూరిబాబు మండిపడ్డారు. గ్యాస్ సిలిండర్ ధరల పెంపును నిరసిస్తూ సోమవారం స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో 'భారీ ధర్నా' నిర్వహించారు.

?ఈ సందర్భంగా సూరిబాబు మాట్లాడుతూ అంతర్జాతీయ యుద్ధ పరిణామాలను సాకుగా చూపి, ప్రజలపై భారాలు మోపడం గమనార్హమని విమర్శించారు. ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలతో సతమతమవుతున్న సామాన్య జనంపై గ్యాస్ ధరల భారం వేయడం పుండు మీద కారం చల్లడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. డొమెస్టిక్ సిలిండర్‌పై రూ.60, కమర్షియల్ సిలిండర్‌పై రూ. 115 పెంచడం చిరు వ్యాపారుల పొట్ట కొట్టడమేనని, దీనివల్ల అసంఘటిత రంగ కార్మికుల జీవితాలు అతలాకుతలం అవుతాయన్నారు. యుద్ధ పరిణామాలను అడ్డం పెట్టుకుని ప్రజల నుంచి పన్నుల రూపంలో దోపిడీ చేయడం కేంద్ర ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని, కేంద్రానికి ఊపిరి పోస్తున్న టీడీపీ తక్షణమే ఈ ధరల ఉపసంహరణ కోసం ఒత్తిడి తేవాలన్నారు. పెంచిన ధరలను తక్షణమే వెనక్కి తీసుకోకుంటే ప్రజాక్షేత్రంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు సిరిపురపు శ్రీనివాస్, కేదారి నాగు, కూనిరెడ్డి అప్పన్న, గడిగట్ల సత్తిబాబు, రొంగల సుబ్బలక్ష్మి, యాసలపు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయాలలో ఉన్నవారు పదవి, అధికారం ఉన్నా, లేకపోయినా ప్రజాసేవ చెయ్యాలి- ఎమ్మెల్యే బొలిశెట్టి.





**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. మార్చి 09.** రాజకీయాలలో ఉన్నవారు పదవి, అధికారం ఉన్నా, లేకపోయినా ప్రజాసేవ కొనసాగించాలని శాసనసభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. పెంటపాడు మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం జరిగింది. మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు కట్టుబోయిన వెంకటలక్ష్మి అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ త్వరలో పదవీ కాలం ముగుస్తుంది అనే భావనతో కొందరు సర్పంచులు, ఎంపీటీసీలు నిర్లిప్తంగా ఉండటం సరికాదని అన్నారు. నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారం కోసం పనిచేసే వారికి ప్రజల్లో ఎప్పటికీ మంచి స్థానం ఉంటుందని అన్నారు. పెంటపాడు మండలంలో ప్రధాన రహదారుల నిర్మాణం దాదాపు పూర్తయిందని తెలిపారు. రావిపాడు కొండేపాడు రహదారి త్వరలో పూర్తవుతుందని అన్నారు. మండలంలో పూర్తిస్థాయి డ్రైనేజీలు, పారిశుధ్య నిర్వహణపై దృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు. ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు గత వైసిపి ప్రభుత్వం దుర్వినియోగం చేసిందని విమర్శించారు. ఆ నిధులను ఆయా ప్రాంతాల్లోనే ఖర్చు చేసే విధంగా చర్యలు చేపట్టామన్నారు. జగనన్న కాలనీలో మౌలిక సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ప్రభుత్వ భూముల ఆక్రమణ తొలగించి భావితరాలకు సౌకర్యవంతమైన ఆరోగ్యకరమైన పరిసరాలను అందించవలసిన బాధ్యత మన అందరిపై ఉందని అన్నారు. ప్రభుత్వ భూముల ఆక్రమణల తొలగింపులో ఎన్ని ఇబ్బందులు ఎదురైనా వెనకడుగు వేసే ప్రసక్తి లేదన్నారు. అధికారులు చట్టబద్ధంగా వ్యవహరించాలని కోరారు. పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా పవన్ కళ్యాణ్ గ్రామాల సర్వతో ముఖాభివృద్ధికి అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేశారని అన్నారు. పవన్ సహకారంతో తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో ప్రతి గ్రామానికి పూర్తిస్థాయిలో మౌలిక సౌకర్యాలు కల్పిస్తామని అన్నారు. సమావేశంలో ప్రభుత్వ అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.



# చింతూరులో ఎస్.టి కమిషన్ ప్రజా గ్రీవెన్స్

✸ నాలుగు మండలాల ప్రజల నుంచి వినతులు స్వీకరణ





**చింతూరు, పెన్ పవర్ మార్చి 9:**ఆంధ్రప్రదేశ్ ఎస్.టి కమిషన్ ఆధ్వర్యంలో చింతూరు ఐటిడిఎ కార్యాలయంలో సోమవారం ప్రజా గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్.టి కమిషన్ చైర్మన్ ఎస్. బొజ్జిరెడ్డి, సభ్యురాలు, జి. సునీత హాజరయ్యారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమైన ఈ కార్యక్రమంలో నాలుగు మండలాల ప్రజల నుంచి వివిధ సమస్యలపై దరఖాస్తులు స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చైర్మన్ ఎస్. బొజ్జిరెడ్డి మాట్లాడుతూ ఆర్ అండ్ ఆర్ లబ్దిదారులకు ఇప్పటికే నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. సంబంధిత సమస్యలను పరిష్కార దిశగా తీసుకెళ్లేందుకు అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కమిషన్ సభ్యురాలు జి. సునీత మాట్లాడుతూ ఆర్ అండ్ ఆర్ మరియు మ్యుటేషన్‌కు సంబంధించిన ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. అధికారులు కోరిన డాక్యుమెంట్లు సమర్పిస్తే సమస్యలను త్వరగా పరిష్కరించే చర్యలు తీసుకుంటామని చెప్పారు. అలాగే గ్రామసభల ద్వారా తీర్మానాలు చేసుకొని సమస్యలను పరిష్కరించుకోవాలని, ఎవరూ కలత చెందవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు, జడ్పీటీసీ సభ్యులు, మండల అధ్యక్షులు, ఎన్జీవో ప్రతినిధి జమాల్ ఖాన్, ఏపీవో టిడబ్ల్యూ, ఐటిడిఎ అధికారులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (టిడబ్ల్యూ), డీఏఓ, సబ్ కలెక్టర్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. అదేవిధంగా ఈ కార్యక్రమానికి హాజరైన వివిధ రాజకీయ పార్టీల నాయకులు కూడా ఎస్.టి కమిషన్ చైర్మన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి గిరిజన ప్రాంతాల సమస్యలను వివరించారు. జనసేన నాయకులు సహా పలువురు నాయకులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# తాడేపల్లిగూడెం ఇఫ్తార్ విందు కార్యక్రమం లో పాలుగున్న వైసీపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబెర్ కొట్టు వెంకట్ (నాగు)





**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. మార్చి 09.**తాడేపల్లిగూడెం ఇఫ్తార్ విందు కార్యక్రమం లో పాలుగున్న వైసీపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబెర్ కొట్టు వెంకట్ (నాగు) మాట్లాడుతూ రంజాన్ మాసం పవిత్రమైన రోజుల సందర్భంగా మహమ్మద్ ప్రవక్త చెప్పినట్లు మనలో వున్నా తప్పులను సరిదిద్దుకొని. మన ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ అందరితో సంతోషంగా గడపడానికి రంజాన్ మాసం మనకి గొప్ప అవకాశం.

అలాగే ఇఫ్తార్ విందులో మనమంతా ఒకరికి ఒకరు సహాయం చేసుకుంటూ మనమంతా కులమతాలకు అతీతంగా మనం అంతా ఒక కుటుంబం ఒక దేశం అని గర్వంగా చెప్పుకోవడానికి ఇది ఒక అద్భుతమైన అవకాశం గా భావిస్తున్నాను. అందరూ సంతోషంగా ఆనందంగా ఉండాలని మనస్ఫూర్తిగా ఆ అల్లాః ను కోరుకుంటున్నా ను అని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమం లో మసీద్ పెద్దలు షేక్ బాజీ,షేక్ మీరా, ఫిర్దోషు ఖాన్, ఫాజిల్, మున్నార్ ,వైస్సార్సీపీ నాయకులు బొడ్డని శ్రీనివాస్, కట్టా నాగరాజు, ఉదయ్ భాస్కర్ పెందుర్తి జీవన్, పాలకోడేటి సురేష్, అరుమిల్లి సూర్యచంద్రావు మాస్టర్ రవి,రాజు, పవన్, రమేష్ రెడ్డి, వైస్సార్సీపీ కార్యకర్తలు పాల్గొన్నారు

# సుకన్య సమృద్ధి ఖాతాల ప్రత్యేక నమోదు డ్రైవ్



**గంగవరం, పెన్ పవర్, మార్చి 9:**అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇండియా పోస్ట్ ఆధ్వర్యంలో గంగవరం సబ్ పోస్టాఫీస్ పరిధిలోని శాఖా పోస్టాఫీసులలో సుకన్య సమృద్ధి ఖాతాల (ఎస్ఎస్ఏ) ప్రారంభానికి ప్రత్యేక నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని గంగవరం సబ్ పోస్టుమాస్టర్ మోహన్ ఆధ్వర్యంలో గంగవరం సబ్ పోస్టాఫీస్‌తో పాటు పరిధిలోని శాఖా పోస్టాఫీసులు నిర్వహించాయి. బాలికల భవిష్యత్ ఆర్థిక భద్రతను దృష్టిలో ఉంచుకుని తల్లిదండ్రులు సుకన్య సమృద్ధి యోజన ఖాతాలు ప్రారంభించాలని ఈ సందర్భంగా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా గంగవరం మండలంలోని వివిధ గ్రామాల పోస్టాఫీసుల ద్వారా మొత్తం 16 సుకన్య సమృద్ధి ఖాతాలను ప్రారంభించి, లబ్ధిదారులకు పాస్‌బుక్స్‌ను కూడా అందజేశారు. గ్రామీణ ప్రాంతాల్లో బాలికల భవిష్యత్ విద్య, వివాహ అవసరాల కోసం పొదుపు అలవాటు పెంపొందించడంలో సుకన్య సమృద్ధి యోజన ఎంతో ఉపయోగకరమని పోస్టల్ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోస్టల్ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# మాతృశ్రీ గడి బాపనమ్మ తల్లి క్యాలెండర్ ఆవిష్కరణ




**రంపచోడవరం, పెన్ పవర్ మార్చి 9:**అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం మండలం సీమగండి గ్రామంలో సీతపల్లి వద్ద ఉన్న మాతృశ్రీ గడి బాపనమ్మ తల్లి ఆలయానికి సంబంధించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను మాజీ ఎమ్మెల్యే శీతంశెట్టి వెంకటేశ్వరరావు సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడి బాపనమ్మ తల్లి ఆలయం ప్రాంతీయ భక్తులకు ఆధ్యాత్మిక కేంద్రంగా నిలుస్తోందని అన్నారు. ఆలయ అభివృద్ధికి భక్తులంతా సహకరించాలని కోరారు. భక్తులు ఆధ్యాత్మిక భావనతో దేవాలయ కార్యక్రమాల్లో పాల్గొనడం ఆనందదాయకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి బత్తిన కోటేశ్వరరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం క్యాలెండర్‌ను భక్తులకు అందజేశారు. కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# మలకపల్లి పి.హెచ్.సి పరిధిలో హెచ్.పి.వి వ్యాక్సినేషన్ ప్రారంభం



**తాళ్ళపూడి, పెన్ పవర్, మార్చి 9:**మలకపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఈ నెల 10వ తేదీ మంగళవారం నుండి బాలికలకు హెచ్.పి.వి వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు వైద్యాధికారిణి డాక్టర్ పి.అన్నపూర్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ప్రస్తుతం 14 సంవత్సరాల వయస్సు గల (అనగా ప్రస్తుతం 15వ ఏట ఉన్న) బాలికలకు ఈ టీకా వేయడం జరుగుతుంది. ఇది సింగిల్ డోస్ (ఒక్కసారి మాత్రమే) ఇచ్చే వ్యాక్సిన్. ఈ వాక్సిన్ కొరకు మలకపల్లి ఆరోగ్య కేంద్రం పరిధిలో మొత్తం 161 మంది అర్హులైన బాలికలను గుర్తించడం జరిగిందని చెప్పారు. వారందరికీ ఈ వ్యాక్సిన్ వేయడం జరుగుతుందని. గర్భాశయ క్యాన్సర్ అనేది నివారించదగిన వ్యాధి అని, ఈ టీకా తీసుకోవడం వల్ల భవిష్యత్తులో వచ్చే క్యాన్సర్ ప్రమాదాన్ని నివారించవచ్చునని అన్నారు. కనుక గర్భాశయ క్యాన్సర్ నివారణకు ఈ టీకా ఎంతో కీలకమని, అర్హులైన బాలికల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ పిల్లలకు వ్యాక్సిన్ వేయించాలని ఆమె కోరారు.

# పోలీసు "పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం" లో 45 ఫిర్యాదులు



**రాజమహేంద్రవరం, పెన్ పవర్,మార్చి 9 :**రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న "ప్రజా సమస్యల పరిష్కార వేదిక "పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం", (పి.జి.ఆర్.ఎస్) కార్యక్రమాన్ని సోమవారం తూర్పుగోదావరి జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ డి. నరసింహ కిషోర్ నిర్వహించారు. జిల్లా నలుమూలల ప్రజల నుంచి వివిధ రకాల అర్జీలను స్వీకరించి సంబంధిత స్టేషన్ పోలీసు అధికారులతో ఫోన్లో మాట్లాడి ఫిర్యాది దారుల సమస్యలను చట్ట పరిధిలో న్యాయం చేయవలసినదిగా ఉత్తర్వులు ఇచారు. పోలీసు "పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం" కార్యక్రమానికి 45 ఫిర్యాదులు రాగా, వీటిలో సివిల్ కేసులు, కుటుంబ సమస్యల గురించి, చీటింగ్ కేసులు, కొట్లాట కేసులు ఇతర కేసులకు సంబంధించిన ఫిర్యాదులు స్వీకరించారు.